ప్రజాశక్తి

మంగళవారం 23 డిసెంబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

భూ సమస్యలపై పెరుగుతున్న వినతులు

- గెడ్డల్లో అక్రమ నిర్మాణాలపై 'గ్రీవెన్స్'కు వెల్లువెత్తిన ఫిర్యాదులు
- ఇళ్ల కోసం అర్హుల అభ్యర్థనలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ (గ్రీవెన్స్)కు ఎప్పటిలాగే గెడ్డలపై అక్రమ కట్టడాలు, జిఓ ప్రకారం ఇళ్ల రిజిస్ట్రేషన్లు, తమ భూములను ఆక్రమిస్తున్నారంటూ ఫిర్యాదులు వెల్లువెత్తాయి. జిల్లాల విభజన తర్వాత విశాఖపట్నం జిల్లాలో ఆనందపురం, భీమునిపట్నం, పద్మనాభం మండలాలు, విశాఖ గ్రామీణ ప్రాంతాలు ప్రధానంగా ఉండడంతో భూ సమస్యలు, గెడ్డలపై నిర్మాణాలు, పేదల ఇళ్ల డిమాండ్ పెద్ద ఎత్తున ఏళ్ల తరబడి కొనసాగుతూనే ఉంది. ఉమ్మడి విశాఖ జిల్లాలోనూ ఇవేమీ పరిష్కారం కాకపోగా విభజిత జిల్లాలోనూ ఇదే సమస్యను జనం ఎదుర్కొంటున్నారు. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ సంపద అక్రమార్కుల పాలవుతుందంటూ ఆరోపణలు గ్రీవెన్స్‌లో వెల్లువెత్తుతున్నాయి.

వివేకానందనగర్‌లో గెడ్డపై అక్రమ కట్టడంపై ఫిర్యాదు...

విశాఖ నగరంలోని 8వ వార్డు ఎండాడ-వివేకానందనగర్‌లో సర్వే నెంబర్ 57/1 ప్లాట్ నెంబర్ 66లో గల ఖాళీ స్థలం (గెడ్డపక్కన) 220 చదరపు గజాలు (తూర్పు, దక్షిణంలో వాటర్ కెనాల్) ఉన్న స్థలం (అసైన్‌మెంట్ కాని భూమి)లో భాగమైనటువంటి విలువైన 63.34 గజాల స్థలంపై ఒక వ్యక్తి అక్రమంగా నిర్మాణం సాగిస్తున్నట్టు సోమవారం రావిపాటి శ్రీనివాసరావు ఫిర్యాదును గ్రీవెన్స్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు సమర్పించారు. గ్రీవెన్స్ నెంబరు విఎస్‌పి - 202512226588 ద్వారా సదరు వ్యక్తి ఇంకొంతమంది ఫిర్యాదు చేశారు. 2026 జనవరి 6వ తేదీలోగా సమస్యను పరిష్కరించేందుకు గడువును అధికారులు విధించారు. గతంలో ఇదే అక్రమ కట్టడంపై మధురవాడ నగర పాలక సంస్థ కార్యాలయంలో అల్లూరి పార్వతి ఈ ఏడాది నవంబర్ 24న ఫిర్యాదు చేయగా క్షేత్రస్థాయి పరిశీలన చేశామని సెల్ఫ్ సర్టిఫికేషన్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా అనుమతులను సదరు వ్యక్తి పొందారని త్వరలో దీంతో నిలుపుదల చేయమని నోటీసులు ఇచ్చినట్లు సదరు అధికారులు తెలియజేసినా పని ఆగడం లేదని శ్రీనివాసరావు వెల్లడించారు.

కేసులేకపోయినా రిజిస్ట్రేషన్‌కు రెవెన్యూ

వివేకానందనగర్‌లో గెడ్డను ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారని ఫిర్యాదు వచ్చిన భవనం ఇదే..

మోకాలడ్డు

జిఓ 30 ప్రకారం విశాఖ నగర పాలక సంస్థ పరిధి 8వ వార్డు ఎండాడలో సర్వే నెంబర్1లో నివాసం ఉంటున్న ఎస్‌సి, బిసి కాలనీల్లో గల 500 మంది పేద కుటుంబాలకు ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతూ కృష్ణమూర్తి నాయుడు, భారతి సోమవారం పిజిఆర్ఎస్‌లో వినతిపత్రాలను అందించారు. 1985లో ఎన్‌టిఆర్ సిఎంగా ఉన్నప్పుడు ప్రభుత్వం 3 సెంట్ల స్థలంలో ఇల్లు కట్టించి ఇచ్చారని, నాటి నుంచి నేటి వరకూ ఇదే కాలనీలో 500 కుటుంబాలు నివాసముంటున్నాయని మిగతా 2లో..

5

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

'ఉపాధి హామీ'కి కేంద్రం తూట్లు

చట్ట సవరణలపై నిరసనలు

విశాఖలో రూ.27 కోట్ల జిఎస్‌టి స్కామ్

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : నకిలీ ఇన్వాయిస్‌లతో కోట్లాది రూపాయల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందుతున్న భారీ నెట్‌వర్క్‌ను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జిఎస్‌టి ఇంటెలిజెన్స్ విశాఖపట్నం జోనల్ యూనిట్ అధికారులు ఛేదించారని డిప్యూటీ డైరెక్టర్ శ్వేతా సురేష్ తెలిపారు. ఈ కుంభకోణానికి ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న మల్లికార్జున మనోజ్ కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. సుమారు రూ. 27.07 కోట్ల నకిలీ ఐటిసిని పొందినట్లు, మరో రూ.15.30 కోట్ల క్రెడిట్‌ను ఇతరులకు బదిలీ చేసినట్లు వెల్లడించారు. ఎలాంటి వస్తువులు, సేవలు సరఫరా చేయకుండానే, కేవలం కాగితాల మీద డమ్మీ కంపెనీలను సృష్టించి సిమెంట్, మ్యాన్ పవర్, కనస్ట్రక్షన్ మెటీరియల్ పేరిట నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించారని, ఈ లావాదేవీల ద్వారా లబ్ధిదారుల నుంచి 3 శాతం కమిషన్ తీసుకుని, మిగిలిన మొత్తాన్ని బ్యాంకింగ్ ఛానళ్ల ద్వారా నగదు రూపంలోకి మార్చి తిరిగి వారికి పంపేవారని పేర్కొన్నారు. నిందితునిపై సిజిఎస్‌టి చట్టం 2017లోని సెక్షన్ 132 కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విశాఖ డిజిజిఐ విభాగం చేపట్టిన నాలుగో అరెస్ట్ ఇది అని పేర్కొన్నారు. పన్ను ఎగవేతదారులు, నకిలీ ఐటిసి నెట్‌వర్క్‌ల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

పోర్టు చరిత్రలో మరో మైలురాయి

వార్త 8లో..

జివిఎంసిలో పిపిపి పేరిట రోడ్లు ప్రయివేటీకరణను ఉపసంహరించాలి

వార్త 8లో..

అవగాహనతోనే మోసాలకు అడ్డుకట్ట : జెసి

వార్త 2లో..

గణిత మేధావి శ్రీనివాస రామానుజన్‌కు ఘన నివాళి

వార్త 3లో..

ఆటో జాతానుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు

సిఐటియు మహాసభ జయప్రదానికి విస్తృత ప్రచారం

వార్త 8లో..

ఇకపై ఆన్ లైన్‌లో సర్వే సర్టిఫికెట్లు

మేయర్ పీలా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని భవనాలు, ఖాళీ స్థలాలకు ఇకపై సర్వే సర్టిఫికెట్లు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనే పొందవచ్చని మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశమందిరంలో సర్వే సర్టిఫికెట్ అప్లికేషన్‌ను జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగర పరిధిలో భవనాలు, ఖాళీ స్థలాలకు సర్వే సర్టిఫికేట్ పొందవలసి ఉన్నందున ప్రజలకు ఇబ్బందులు లేకుండా జివిఎంసి కమిషనర్ వినూత్న ఆలోచనతో సర్వే సర్టిఫికెట్లను జివిఎంసి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనే జారీ చేసేందుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. దీనివల్ల వారం రోజుల్లోనే సర్వే సర్టిఫికెట్లు పొందువచ్చని పేర్కొన్నారు. సర్వే సర్టిఫికెట్లు వారం రోజుల్లో జారీ అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ, ఇకపై వారం రోజుల్లో సులభంగా ఆన్‌లైన్‌లోనే సర్వే సర్టిఫికెట్ పొందవచ్చన్నారు. రెవెన్యూ, పట్టణ ప్రణాళిక అధికారులకు, వార్డు సచివాలయ కార్యదర్శులకు దీనికి సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని జివిఎంసి ఉన్నతాధికారులను కమిషనర్ ఆదేశించారు.

ఐఎన్ఎస్ సర్కార్స్ కమాండింగ్ ఆఫీసర్‌గా కార్తీక్‌మూర్తి

ప్రజాశక్తి-ఎంవిపికాలనీ: తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం పరిధిలోని కీలక బేస్ డిపో నౌక 'ఐఎన్ఎస్ సర్కార్స్' కమాండింగ్ ఆఫీసర్‌గా కమోడోర్ కార్తీక్ మూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఈ బాధ్యతల్లో ఉన్న కమోడోర్ హ్యాపీ మోహన్, నుండి ఆయన అధికారికంగా బాధ్యతలను స్వీకరించారు. కమోడోర్ కార్తీక్ మూర్తి 1998, జనవరి 1న భారత నౌకాదళంలో కమిషన్ పొందారు. ఐఎన్ఎస్ టి 80, విపుల్, కుతార్ సాత్పురా వంటి యుద్ధ నౌకలకు కమాండర్‌గా వ్యవహరించారు. ఇండోనేషియాలోని భారత రాయబార కార్యాలయంలో 'డిఫెన్స్ అటాచ్'గా దేశానికి సేవలందించారు. నౌకాదళంలో ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా 2023లో భారత ప్రభుత్వం ఆయనను 'విశిష్ట సేవా మెడల్' తో సత్కరించింది. నూతన కమాండర్‌గా బాధ్యతలు చేపట్టిన కమోడోర్ కార్తీక్ మూర్తికి నౌకాదళ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

మొదటి పేజీ తరువాయి..

భూ సమస్యలపై పెరుగుతున్న వినతులు

వారు పేర్కొన్నారు. తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా జిఒ 388 ద్వారా 2018లో పట్టాలు కూడా సాధించామని, 2025లో జిఒ30 ప్రకారం అర్హులుగా ప్రభుత్వం ప్రకటించినప్పటికీ కొంతమంది పెద్దలుగా చెలామణి అవుతూ గతంలో కేసు ఉందనే నెపంతో తమ పట్టాల రిజిస్ట్రేషన్‌ను అడ్డుకుంటున్నారంటూ కృష్ణమూర్తినాయుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. వాస్తవానికి 2020 అక్టోబర్ 21న ఈ భూములపై రిట్ పిటిషన్ నెంబర్ 271 వేశారని రాష్ట్ర కోర్టు 2022 సెప్టెంబర్ 14న డిజాల్వ్ చేసేసినప్పటికీ స్థానిక చినగదిలి తహశీల్దార్ ఈ విషయంపై కేసు ఉందని పట్టా రిజిస్ట్రేషన్‌కు అంగీకరించడం లేదని వివరించారు. తక్షణమే జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్, జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ కలుగజేసుకుని తమకు రిజిస్ట్రేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

దీక్షలో కూర్చున్న మత్స్యకార మహిళలు

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు ఇవ్వాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని సిఐటియు మత్స్యకార మహిళా విభాగం కార్యదర్శి కె.లక్ష్మి డిమాండ్‌చేశారు. స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 1729వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో మత్స్యకార మహిళలు కూర్చున్నారు. ఈ సందర్భంగా కె.లక్ష్మి మాట్లాడుతూ, దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు ఉక్కు కర్మాగారాలకు సొంత గనులు ఉన్నాయని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు మాత్రం ఇవ్వడంలేదని తెలిపారు. సొంత గనులు లేని కారణంగానే విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు నష్టాలొస్తున్నాయన్నారు. సొంత గనులు ఇచ్చేందుకు ఇబ్బందులుంటే విశాఖ స్టీల్స్ సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉత్పత్తితో ముడిపెడుతూ వేతనాలు చెల్లించే విధానాన్ని విడనాడాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో జి.ఎల్లమ్మ, ఎం.గురయమ్మ, రత్న, ఎస్.రమ్య, ఎం.ధన, జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చేరికలు అడ్డుకునేందుకు ప్రభుత్వం కుట్ర : వైసిపి

ప్రజాశక్తి-ఎంవిపికాలనీ: నగరంలో వైసిపిలోకి జరుగుతున్న భారీ చేరికలను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం కుట్రకు తెరలేపిందని వైసిపి నాయకులు ధ్వజమెత్తాయి. సోమవారం ధర్మాన ఆనంద్ వందలాది మంది అనుచరులతో వైసిపిలో చేరేందుకు సిద్ధమవగా, చివరి నిమిషంలో ప్రభుత్వం అడ్డంకులు సృష్టించిందని ఆరోపించారు. కార్యక్రమం కోసం విఎంఆర్‌డిఎకు రూ. 71,300 అధికారికంగా చెల్లించి, వుడా చిల్డ్రన్ థియేటర్ వేదికగా అనుమతి తీసుకున్నామని, భారీ సంఖ్యలో తరలివచ్చిన జనసందోహాన్ని చూసి ఓర్వలేక, కూటమి నేతలు ఒత్తిడితో థియేటర్ సిబ్బంది గేట్లకు తాళం వేశారని ఆరోపించారు. దీనిని నిరసిస్తూ విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షులు కెకె.రాజు ఆధ్వర్యంలో కార్యకర్తలు గేటు వద్దే బైఠాయించి అక్కడే పార్టీ చేరికల కార్యక్రమం నిర్వహించారు. ధర్మాన ఆనంద్‌తో పాటు పలువురు నేతలు, వందలాది మంది కార్యకర్తలకు కెకె. రాజు వైసిపి కండువా కప్పి ఆహ్వానించారు.

విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరీనా బుకింగ్స్ రద్దు

విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో జరగాల్సిన పలు కార్యక్రమాలను సాంకేతిక నిర్వహణ కారణాల దృష్ట్యా రద్దు చేస్తున్నట్లు మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ తెలిపారు. ధర్మాన ఆనంద్ పేరు మీద బుక్ చేసిన గెట్ టు గెదర్ ప్రోగ్రాం కోసం ప్రాంగణంలో రాజకీయ బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారని, విఎంఆర్‌డిఎ నిబంధన 10 ప్రకారం రాజకీయ ప్రచార సామాగ్రి ప్రదర్శించడం నిషేధమని పేర్కొన్నారు. వీటితో పాటు ప్రాంగణంలోని సెంట్రల్ ఎసి పనిచేయకపోవడంతో, అత్యవసర మరమ్మతుల కోసం మూడు రోజుల పాటు అన్ని కేటాయింపులను రద్దు చేసినట్లు తెలిపారు

పిజిఆర్ఎస్ వినతులకు సకాలంలో పరిష్కారం

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

విద్యుత్ సరఫరా లేక సెల్ ఫోన్ వెలుతురులో వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో ప్రజల నుంచి వచ్చే వినతులకు సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపాలని అధికారులను జాయింట్ కలెక్టర్ కె.మయూర్అశోక్ ఆదేశించారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ప్రజల నుంచి అందే ఫిర్యాదులకు తగిన విధంగా సరైన రీతిలో ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని, సంతృప్తికర విధంగా పరిష్కారం చూపాలని చెప్పారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 377 మంది వినతులు సమర్పించారు. అందులో రెవెన్యూ విభాగానికి చెందినవి 106, జివిఎంసి 121 ఉన్నాయి. ఇతర అన్ని శాఖల సంబంధించి 116 వినతులు రాగా పోలీస్ శాఖకు 34 వచ్చాయి. జాయింట్ కలెక్టర్‌తో పాటు ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ సత్తిబాబు, యుసిడి పీడీ సత్యవేణి, ఎసిపి ధనుంజయరెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆ భూ కేటాయింపులు ఆపాలి...

గ్రేటర్ విశాఖ బ్యూరో : గాజువాక ప్రాంతంలో బిపిసిఎల్ బాట్లింగ్ ప్లాంట్‌కు విశాఖ పోర్టు భూమి సుమారు 7 ఎకరాలు ఇవ్వడం ద్వారా మింది, ములగాడ, అక్కిరెడ్డిపాలెం, పంచవటి టౌన్‌షిప్ ప్రాంత ప్రజలు తీవ్ర కాలుష్య అవస్థలు పడతారని, తక్షణమే భూకేటాయింపులు పోర్టు ఆపాలని 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో హెచ్‌పిసిఎల్, కోరమండల్ ఇంటర్నేషనల్, విశాఖ డెయిరీ వంటి పరిశ్రమల వల్ల గాలి, నీరు భూగర్భజలాలు తీవ్రంగా కలుషితమయ్యాయని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు ఆమె వివరించారు.

వినతిని చూపుతున్న కార్పొరేటర్ గుడివాడ అనూష

ఈ నేపథ్యంలో విశాఖ పోర్టు 200 మీటర్ల దూరంలోనే సన్వేరా గోదాములు వంటి ప్రమాదకర పదార్థాల నిల్వ కేంద్రాలకు అనుమతులు ఇవ్వడం, ప్రభుత్వం నిర్దేశించిన 500 మీటర్ల బఫర్ జోన్ నిబంధనలకు సైతం ఇది విరుద్ధమని వివరించారు. అత్యంత దహనశీలమైన ప్రమాదకర పదార్థాలు జనసాంద్రత గల ప్రాంతాల్లో ప్రజలకు నష్టం చేస్తాయని, అలాంటి గోదాములకు వైజాగ్ పోర్టు ఎలా భూములను ఇస్తుందంటూ మండిపడ్డారు. తక్షణమే భూ కేటాయింపులను వెనక్కి తీసుకోకపోతే ప్రజలను సమీకరించి ఆందోళన చేపడతామని అనూష హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌన్‌షిప్ సభ్యులు చిన్నారావు, విశ్వనాథ్, యువశ్రీ, అప్పలరాజు తదితరులున్నారు.

అవగాహనతోనే మోసాలకు అడ్డుకట్ట : జెసి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : హక్కులను ఆయుధాలుగా మలుచుకొని వినియోగదారులు మోసాలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పిలుపునిచ్చారు. జాతీయ వినియోగదారుల హక్కుల వారోత్సవాల్లో భాగంగా కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రూపొందించిన 'మేలుకో, హక్కులు తెలుసుకో' అందరి చుట్టం వినియోగదారుల రక్షణ చట్టం' బ్రోచర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా జెసి మయూర్ అశోక్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఆన్‌లైన్ షాపింగ్ పెరిగిన తరుణంలో సైబర్ మోసాలు, తప్పుడు ప్రకటనల పట్ల కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించి సత్వర న్యాయం పొందవచ్చని తెలిపారు. వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, సేవలు, పరిష్కారానికి ఆన్‌లైన్ వేదికలు, తప్పుడు ప్రకటనల వల్ల కలిగే నష్టాలు, పరిష్కారమార్గాలు, ఫిర్యాదు చేయు విధానం, దరఖాస్తు నమూనాలను బ్రోచర్‌లో పొందుపరచడం ద్వారా వినియోగదారులకు సరైన దిశానిర్దేశం లభిస్తుందన్నారు. వినియోగదారుల కమిషన్లు ఇచ్చే తీర్పులు బాధితులకు భరోసా ఇస్తాయని, ప్రభుత్వ ఆన్‌లైన్ వేదికలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చైతన్యవంతమైన వినియోగదారులే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని జెసి పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వి.భాస్కరరావు, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ మై భారత్ (నెహ్రూ యువ కేంద్రం) డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు, కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ ం (ష్ట్ర అధ్యక్షుడు కాం(డ్రేగుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా 'సరస్-2025' డ్వాక్రాబజార్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరుగుతున్న అఖిల భారత 'సరస్-2025' డ్వాక్రా బజార్‌కు విశేష స్పందన లభిస్తోంది. డిసెంబర్ 15న ప్రారంభమైన ఈ ప్రదర్శన 26వ తేదీ వరకు కొనసాగనుంది. స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారుచేసిన ఉత్పత్తులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు లక్ష్మీపతి మాట్లాడుతూ, ఈ ప్రదర్శనలో దేశవ్యాప్తంగా సుమారు 550 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారని తెలిపారు. మొత్తం 266 స్టాళ్లలో వస్త్రాలు, హస్తకళలు, ఆహార ఉత్పత్తుల విక్రయాలు జరుగుతున్నాయని చెప్పారు. హర్యానా లెదర్ బ్యాగులు, జార్ఖండ్ దుస్తులు, కాశ్మీర్ పట్టుచీరలు తదితర అనేక రకాల ఉత్పత్తులు ఇక్కడ లభిస్తున్నాయన్నారు. గత ఏడు రోజుల్లో సుమారు రూ. 9,73,97,900 విలువైన అమ్మకాలు జరిగాయని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10 నుంచి రాత్రి 9:30 గంటల వరకు సందర్శకులను అనుమతిస్తారని, సాయంత్రం వేళల్లో ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొనారు. ప్రదర్శనను సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పోవర్టీ (సెర్ప్), జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

కేసులతో ఉద్యోగాలను అడ్డుకోవద్దు

విద్యార్థి, యువజన విభాగాల నిరసన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నిరుద్యోగుల పట్ల వైసిపి నేతలు వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందని, కోర్టుల్లో కేసులు వేసి తమకు ఉద్యోగాలకు రాకుండా చేస్తున్నారని, ఆరోపిస్తూ యువజన విద్యార్థి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు తలసముద్రం సూర్యం, పెద్దాడ గిరిధర్, వియ్యపు ఎల్లాజీ మీడియాతో మాట్లాడుతూ, ఐటి సంస్థలకు వ్యతిరేకంగా ప్రయివేటు వ్యక్తుల ముసుగులో వైసిపి తప్పుడు కేసులు పెడుతోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అనేక సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తుంటే, అది చూసి ఓర్వలేక వైసిపి నేతలు కోర్టుల్లో కేసులు వేసి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశం లేకుండా చేస్తున్నారని విమర్శించారు. విభజన ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న నిరుద్యోగ యువత అందరూ ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక వలసలు పోయే పరిస్థితి నెలకొందన్నారు. గత జగన్ ప్రభుత్వం నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ యువతకు న్యాయం చేయాలని సుమారు 20 లక్షలు ఉద్యోగాలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టిస్తున్నారని తెలిపారు. విశాఖలో టిసిఎస్, కాగ్నిజెంటు, సిఫి సత్వా టెక్నాలజీ, గూగుల్, క్యాప్ జెమినీ వంటి పెద్ద పెద్ద అంతర్జాతీయ దిగ్గజాలు విశాఖలో స్థాపించేందుకు శంకుస్థాపనలు చేస్తుంటే జగన్మోహన్‌రెడ్డి కేసులు వేయిస్తూ అడ్డుపడుతున్నారని ఆరోపించారు. ఈ విధానాన్ని నిరుద్యోగ పోరాట సమితి ద్వారా ఖండిస్తున్నామన్నారు.

IN THE HON'BLE COURT OF THE XIII ADDL. DISTRICT AND SESSIONS JUDGE AT : GAJUWAKA
E.A.57/2025 in E.P. 50/2018 in A.C.146/2012

Between:
M/s. Shriram Finanace Ltd
...Petitioner/D.Hr
And
G. Appala Narasamma & others
...Respondents/J.Drs

E.A. NOTICE

To,
Respondent No.5:
Gantyada Tata Rao,
Hindu, aged about 65 years,
R/at D.No.20-03-07,
Durgavanipalem, R.H. Colony,
Gajuwaka,Visakhapatnam.

Please take notice that the above named Petitioner/D.Hr filed the above E.A. against you and the matter stands posted **30-12-2025** for your appearance. You are hereby required to apper before the Hon'ble Court either in person or through duly instructed Advocate **30-12-2025** at **10:30 A:M** in the above Hon'ble Court to answer all material questions, failing which the matter will heard and determined in your absence, exparte as per law.
(By Order of the Hon'ble Court)
KODURI SREENIVASARAO,
Advocate,Visakhapatnam.

యిందు మూలంగా యావన్మందికి తెలియ చేయునది ఏమనగా

మా క్లయింటు **శ్రీమతి అన్నం వెంకట సత్యభాయి.** W/o శ్రీ అన్నం సత్యారావు D.No. 71-48-146, A.K.A.S.C కోలని మల్కాపురం, విశాఖపట్నం 530011 ఛోగట ప్రకారం.
1) శ్రీమతి శరపాద లింగమణి W/o శరపాద, రామకృష్ణ శర్మ
2) శరపాద రామకృష్ణ శర్మ S/o శరపాద అప్పారావు.
3) శరపాద జగదీష్ శర్మ S/o శరపాద రామకృష్ణ శర్మ
4) శరపాద, రామకృష్ణ శర్మ కుమార్తె CH. శేషసాయి W/o CH. సురేష్ పై నలుగురు ఆసామీలు వ్రాయించి యిచ్చిన క్రయపూర్తి ఏమనగా.
పిలక సూర్య ప్రకాష్ రెడ్డి, S/o పిలక అప్పారావు రెడ్డి స్వాధీన క్రయ అగ్రిమెంట్ ద్వారా మాకు క్రమబద్ధమైనటు వంటి "స్థిరాస్తి అనగా గాజువాక SRO ఏరియా, ములగాడ (మ), పిలకవాని పాలెం, Survey no: 35 లో చేరిన సుమారు 110.25 చ॥గ లేక 92.22 చ॥మీ లో గల Ground ఫ్లోర్ RCC దాబా యిల్లు మొత్తం క్రయ విలువ 30 లక్షలు గాను యీ దినమున అనగా 11/12/2025 తేదిన రూ.3,00,000/- (అక్షరముల మూడు లక్షలు) మా క్లయింటు అడ్వాన్స్ ఇవ్వడమైనది. మిగతా సొమ్ము 3 నెలలలోపు అనగా యిల్లు రిజిస్ట్రేషన్ టైంలో నందు చెల్లించుటకును, RCC దాబాయింటికి Current no : 1111911154004870 పైయింటికి హద్దులు,
తూర్పు : శ్రీగుడ్ల శ్రీరాములు గారి దాబాయిల్లు
దక్షిణం: శ్రీమతి దాసరి రమణమ్మ గారి ఖాళీ స్థలం పడమర : రోడ్డు
ఉత్తరం : శ్రీ సుబ్బారావు గారి దాబాయిలు.
తూ.. దండె అ 40,5లు లేక 12.34 మీ
ద.. దండె అ 26.5లు లేక 08.07 మీ
ప... దండె అ 40-5 లు లేక 10.34 మీ
ఉ... దండె అ 26.5లు లేక 08.07. మీ
పై విషయము ఎవరికైనను ఎట్టి అభ్యంతరములు వున్న యెడల
ఈ పేపరు ప్రకటన నుండి 15 దినములు లోపు వారి మెక్క అభ్యంతరములు తెలియ పరచ్చవలెను. లేని యెడల మా క్లయింటు మిగతా క్రయదనము చెల్లించి వారి పేరున రిజిష్ట్రేషన్ చేయించు కొనుటకు నిర్ణయము.
ఎం. రవీంద్రబాబు
అడ్వకేట్ అండ్ నోటరీ పబ్లిక్
విశాఖపట్నం, సెల్ : 7382148985

నేరాలు ఘోరాలు

అవినీతికి ఆస్కారమివ్వొద్దు : సిపి

ప్రజాశక్తి- పద్మనాభం: అవినీతికి అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశించారు. సోమవారం పద్మనాభం పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆరోపణలకు తావులేకుండా సేవలు అందించాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో క్రైమ్ డిసిపి కె.లతా మాధురి, క్రైమ్ జోన్ -వన్ ఎసిపి నరసింహమూర్తి., ఎసిబి క్రైమ్ సిఐ నార్త్ బి సత్యసాయి ప్రసాద్, స్థానిక ఎస్ఐ సిహెచ్ సూర్యనారాయణ, క్రైమ్ ఎస్ఐ వెంకట్రావు పాల్గొన్నారు.

కిశోర వికాసంతో ప్రయోజనం

ప్రజాశక్తి- సీతమ్మధార : కిశోర వికాసం కార్యక్రమాలతో బాలికలకు ప్రయోజనం చేకూరనుందని ఐసిడిఎస్ విశాఖ అర్బన్ సిడిపిఒ కె.నీలిమ అన్నారు. సోమవారం జివిఎంసి 50వ వార్డు మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలోకిశోర వికాసంపై గోపాలపట్నం మండలంలోని పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల నోడల్ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 'కిశోరవికాసం'పై 11 నుంచి 18ఏళ్ల కౌమార బాలికలకు లైంగిక వేధింపులు, పోక్సో చట్టం, బాల్య వివాహాలతో అనర్థాలు తదితర విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎంఇఒ సోమేశ్వరరావు పర్యవేక్షణలో ఐసిడిఎస్ మర్రిపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ జెటిఎస్.జ్యోతి, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ధ్యానంతో బహుళ ప్రయోజనాలు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు యోగా, ధ్యానము గొప్పతనంపై యోగా టీచర్ గాయత్రి అవగాహన కల్పించారు. ఒత్తిడిని అధిగమించి, ఏకాగ్రత పెంచుకోవచ్చున్నారు.కాలేజీ ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ ఎ. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

మేయర్ పీలా శ్రీనివాసరావు

శంకుస్థాపన చేస్తున్న మేయర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రజలకు మౌలిక వసతులు కల్పనే కూటమి ప్రభుత్వ ప్రధమ ప్రాధాన్యత అని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం 49 వ వార్డులో రూ. 2.66కోట్ల జివిఎంసి నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఉత్తర ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్‌రాజుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎన్నికలలో ఇచ్చిన హామీలు శత శాతం పూర్తి చేస్తోందన్నారు.

నగరాభివృద్ధిలో పార్టీలకతీతంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. 49 వ వార్డు సూర్యనగర్, కాలనీ, పట్టాభిరెడ్డి గార్డెన్, ఎఎస్ఆర్ నగర్‌లలో ఎస్‌డబ్ల్యూ కాలువలు, సిసి కాలువలు, కల్వర్టులు, సిసి రోడ్లు, విఆర్‌సిఎస్‌డబ్ల్యూ కాలువలు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విశాఖ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందన్నారు. ఉత్తర నియోజకవర్గం పరిధిలోని అన్ని వార్డుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బి.రాము, జివిఎంసి కార్యనిర్వాహక ఇంజనీర్ పద్మావతి డి ఈ భరణి కుమార్ పాల్గొన్నారు.

పట్టుబడిన గోమాంసం ఖననం

ప్రజాశక్తి - ఆనందపురం : విశాఖ పోలీసులు పెద్దఎత్తున పట్టుకున్న గోమాంసాన్ని కోర్టు ఆదేశాలతో సోమవారం ఖననం చేశారు. 189 టన్నుల సీజ్ చేసిన మాంసాన్ని కుసులువాడ పంచాయతీ పరిధిలోని 116సర్వేనెంబర్‌లోని ప్రభుత్వ భూమిలో పెద్దగోతులు తవ్వి పూడ్చిపెట్టారు. దీనికి సంబంధించి డిసిపి మణికంఠ, ఎసిపి అప్పలరాజు, సిఐ వాసునాయుడు వెల్లడించిన వివరాలివి.

విదేశాలకు గోమాంసాన్ని ఎగుమతి చేసే అంతర్జాతీయ ముఠా గుట్టును విశాఖ పోలీసులు రట్టుచేసిన విషయం తెలిసిందే. ఆనందపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీమిత్ర కోల్డ్‌స్టోరేజీలో నిర్వహించిన తనిఖీల్లో 189 టన్నుల మాంసం పట్టుబడగా, దాన్ని సీజ్ చేశారు. పశు సంవర్ధకశాఖఫిర్యాదుల మేరకు నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన మాంసం శాంపిల్స్‌ను సేకరించి హైదరాబాద్ ల్యాబ్‌కు విశ్లేషణకు పంపగా, 87,945కిలోల గోమాంసం ఉన్నట్లు నిర్ధారించారు. దీనిపై కేసు నమోదు చేసి, ప్రధాన నిందితుడు మన్సూర్ ఆలీని లోనవాలాలో, రషీద్ ఖురేషీని ఉత్తరప్రదేశ్ మీరట్‌లో అరెస్ట్ చేశారు. నిందితులు నకిలీ ఇన్‌వాయిస్‌లు, ఈవేబిల్లులు, హెల్త్ సర్టిఫికెట్లలో గోవు మాంసాన్ని గేదె మాంసంగా రికార్డుల్లో చూపి విశాఖ పోర్టుద్వారా విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు దర్యాప్తులో నిర్ధారించారు. సీజ్ చేసిన మాంసం ఖననానికి అనుమతినివ్వాలని కోర్టును పోలీసులు ఆశ్రయించగా, కోర్టు ఆదేశాలతో సోమవారం జివిఎంసి, కాలుష్యనియంత్రణమండలి, పశుసంవర్ధకశాఖ, రెవెన్యూశాఖల పర్యవేక్షణలో పోలీసుఉల ఆధ్వర్యంలో కుసులువాడ వద్ద ప్రభుత్వ భూమిలో పెద్దగోతులు తీసి అందులో కప్పేశారు.

పలుచోట్ల జాతీయ గణిత దినోత్సవం

గణిత మేధావి శ్రీనివాస రామానుజన్‌కు ఘన నివాళి

ఆనందపురంలో గణిత పోటీల్లో విజేతలతో హెచ్‌ఎం, తదితరులు

ప్రజాశక్తి - పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి గ్రామపంచాయతీ శాంతి నికేతన్ ప్రాంతంలోని వశిష్ట స్కూల్‌లో సోమవారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు 60 మంది విద్యార్థులతో రూపొందించిన 60 గణిత నమూనాలతో ఎగ్జిబిషన్ నిర్వహించారు.. ఉత్తమమైన మూడు ప్రదర్శనలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ముందుగా గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నిర్వాహకులు రామకృష్ణ పాల్గొన్నారు.

మధురవాడ : గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి, జాతీయ గణిత దినోత్సవాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ (హౌరా) గణిత శాస్త్ర విభాగం డీన్ ప్రొఫెసర్ సుకుమార్‌దాస్ అధికారి ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఎస్.అనంతరామకృష్ణ, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు, గణిత శాస్త్ర విభాగాధిపతి, సదస్సు కన్వీనర్ డాక్టర్ వి.శిరీష, కోఆర్డినేటర్‌లు డాక్టర్ ఎం.ఎం.సందీప్, డాక్టర్ పి.శ్రీహరికృష్ణ పాల్గొన్నారు. జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం సందర్భంగా నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించగా, 436 మంది విద్యార్థులు పాల్గొన్నారు విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

తగరపువలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గణిత దినోతవాన్ని పురస్కరించుకుని శ్రీనివాస రామానుజన్‌కు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి శ్రీవాణి నివాళులర్పించారు. స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో పిన్సిపాల్ డాక్టర్. బి. మురళీకృష్ణ డైరెక్టర్ డాక్టర్ ఏ. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గణితంలో పోటీలు నిర్వహించి బహుముతులు అందజేశారు. కన్వీనర్ జెఆర్‌జి. పట్నాయక్ డాక్టర్ జి. చిన్నారావు అడ్మిన్ . విశ్వ ప్రసాద్ పాల్గొన్నారు.చిట్టివలస ఉన్నత పాఠశాలలో గణిత టీచర్ పొన్నగంటి సత్యలక్ష్మిని సాయి సంహిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో సత్కరించి శారీని బహకరించారు. లక్ష్మీపురం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం దంతం శెట్టి సత్యారావుఉపాధ్యాయుల ఈశ్వరరావు సత్యనారాయణ .రేఖ అప్పారావు చిల్ల .వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఆనందపురం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోఇన్‌చార్జి హెచ్‌ఎం సునీత అధ్యక్షతన గణిత దినోత్సవంసందర్భంగా విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంపొందించేందుకు క్విజ్ పోటీలు, గణిత ఫార్ములా పోటీలు నిర్వహించడంతో పాటు బోధనాభ్యసన సామగ్రి ప్రదర్శనా మేళాను ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థుల సంఘం తరపున సంఘ సమన్వయకర్త వి. జాన్ పాల్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పాఠశాల ఎక్స్అఫిషియో మెంబర్ కొట్యాడ సత్యమూర్తి, గణిత ఉపాధ్యాయులు భాస్కర్, శైలా, వాణీ పల్లవి, శ్రీనివాస్ పాల్గొన్నారు గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని రవీంద్రభారతి పాఠశాలలో మ్యాథ్స్ ఎక్స్పోను నిర్వహించారు. ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు జిఎంకె. రమ్య పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్ లో ఇంచార్జి ప్రిన్సిపాల్ జిజిఎస్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గణిత మేధావి ,వి శ్రీనివాస రామానుజన్‌కు నివాళు లర్పించారు. క్విజ్, ముగ్గులు, పాటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి సురేఖ, గణిత విభాగాధిపతి డాక్టర్ విద్యా సాగర్, వైస్ ప్రిన్సిపాల్ విష్ణు మూర్తి పాల్గొన్నారు

కె.కోటపాడు : స్థానక అయ్యన్న పాఠశాలలో రామానుజన్ చిత్ర పటానికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మాజీ విసి ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు, అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాశీంతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యా సంస్థల డైరెక్టర్ నూర్జహాన్, ప్రిన్సిపల్ సుమతి, విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక ఏఎంఏఎల్ కళాశాల ఆవరణలోని రామానుజన్ విగ్రహానికి కరస్పాండెంట్ పెంటకోట వెంకట రామారావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. జయబాబు పూలమాలను వేసి నివాళులర్పించారు. మండలంలోని మామిడిపాలెం హైస్కూల్‌లో గణిత దినోత్సవాన్ని సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన 200 రకాల గణిత నమూనాలను ప్రదర్శించారు. గణితమేళాలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రదానం చేశారు. స్థానిక డైట్ కళాశాలలో జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు, రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు.

సబ్బవరం : మండలంలోని గొట్టివాడ ఎంపిపి పాఠశాలలో హెచ్‌ఎం పివి.ఆనంద్ ఆధ్వర్యంలో గణిత దినోత్సవం నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. విద్యార్థులకు గణితంతో కూడిన ఆటలు, గణిత పజిల్స్, డైస్‌తో ఆటలు, గణిత ప్రతిజ్ఞ, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

కశింకోట : మండలంలో తాళ్ళపాలెం శ్రీగాయత్రి హైస్కూల్‌లో గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ బి.రామ్‌కుమార్ రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థుల గణిత క్విజ్, వ్యాస రచనా పోటీలు నిర్వహించారు. గణిత శాస్త్రవేత్తల వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

ప్రజాశక్తి- ఉక్కునగరం: దువ్వాడ రాశాలమ్మ కాలనీలో అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన ఘటన కలకలం రేపింది. దువ్వాడ పోలీసులు అందించిన వివరాల ప్రకారం, జీవీఎంసీ 86వ వార్డు రాశాలమ్మ కాలనీలో నివాసం ఉంటున్న రావి వెంకటరమణ (పెయింటర్) తన భార్య అనూష, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నాడు. ఇటీవల వెంకటరమణ స్వామి మాల ధరించడంతో, ఆదివారం రాత్రి పూజ నిమిత్తం బయటకు వెళ్లాడు. అనంతరం రాత్రివేళ ఇంటికి తిరిగి వచ్చి తలుపు తట్టగా, కుమారులు తలుపు తీశారు. ఇంట్లోకి వెళ్లిన వెంకటరమణ, తన భార్య అనూష మంచం మీద వెల్లకిలా పడుకుని ఉండటాన్ని గమనించాడు. ఆమెను లేపే ప్రయత్నం చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.అనూష మృతి కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఇది ఆత్మహత్యా? లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అన్న కోణాల్లో దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.ఘటనపై దువ్వాడ సీఐ కె. మల్లేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో మహిళకు గాయాలు

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో మేడివాడ పంచాయతీ శివారు అప్పలమ్మ పాలెం గ్రామానికి చెందిన పాచిలి చిలకమ్మ అగ్ని ప్రమాదంలో గాయాలపాలైంది. వివరాలు ప్రకారం పాచిలి చిలకమ్మ సోమవారం సాయంత్రం చలికి మంట కాగుతుండగా ఆమె చీరకు అగ్గి అంటుకుంది. చీర కాలడంతో శరీరమంతా గాయాల పాలయ్యింది. కుటుంబ సభ్యులు వెంటనే రావికమతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం

ప్రజాశక్తి- ఉక్కునగరం: అగనంపూడి వద్ద కొత్తూరుకు చెందిన రోడ్డు ప్రమాదంలో శిరసపల్లి సన్యాసిరావు (70) మృతి చెందాడు. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌కు సైకిల్‌పై వెళ్లిన సన్యాసిరావు, శనివాడ కూడలి వద్ద రోడ్డు దాటే ప్రయత్నంలో లంకెలపాలెం నుండి గంగవరం పోర్టుకు వెళుతున్న లారీ ఢీకొంది. కిందపడిన సన్యాసిరావుపైనుంచి లారీ ముందర చక్రం వెళ్లడంతో తీవ్రంగా గాయపడిన ఆయనను అగనంపూడి ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి, లారీ డ్రైవర్ ప్రకాష్‌ను అదుపులోకి తీసుకున్నారు.

జూపార్కులో ఆడ సింహం కూన మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలలో తల్లి సంరక్షణలో ఉన్న 83 రోజుల వయస్సు గల ఆడ సింహం కూన సోమవారం తెల్లవారు జామున మృతి చెందినట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. ఐదు రోజులుగా సింహం కూన ఆహారం తీసుకోక పోవడంతో అప్పటి నుంచి వైద్యుల పర్యవేక్షణలో ఉంచినట్టు తెలిపారు. కూన మృతికి కారణం ఇంటస్ససెప్షన్ అని పోస్టుమార్టం రిపోర్టులో నిర్ధారణ అయినట్టు వైద్యులు తెలిపారు.

పోలీస్ అవుట్‌పోస్ట్ ఏర్పాటు

ప్రజాశక్తి- కరాస : పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువచేయడం, శాంతిభద్రతలపరిరక్షణే ధ్యేయంగా ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్‌పరిధిలోని పాత కరాస పెట్రోల్ బంక్ వద్ద పోలీస్‌అవుట్ పోస్టును ఏర్పాటు చేశామని శాంతిభద్రతల విభాగం డిసిపి మేరీ ప్రశాంతి అన్నారు. సోమవారం పోలీసు అవుట్‌పోస్టును వెస్ట్ ఎసిపి పృథ్వీతేజ, సిఐ వి.శంకరనారాయణ, స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవుట్‌పోస్ట్‌లో నలుగురు సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని, ఇద్దరు బైక్‌లపై పెట్రోలింగ్ విధుల్లో మరో ఇద్దరు అవుట్‌పోస్టులో 24గంటలు అందుబాటులో ఉంటారన్నారు. డ్రగ్స్ అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని, మహిళల భద్రత, రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టిపెట్టామన్నారు. కార్యక్రమంలో 52వ వార్డు టిడిపి అధ్యక్షుడు వై.తిరుమలరావు, విశాఖ ఎఎంసి వైస్‌చైర్మన్ వెంకుమహంతి చంద్రశేఖర్, నగర ప్రధాన కార్యదర్శి మందలపు వాసుదేవరావు, పూసపాటి బలభద్రరాజు, ట్రాఫిక్ వాలంటీర్ ఆలివ్ సతీష్, ఎస్ఐలు సిహెచ్.కార్తీక్, నాగమణి, ఎఎస్ఐ,సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు పీసా మహోత్సవ్

పీసా మహోత్సవ్ మస్కట్, టీషర్ట్‌లు ఆవిష్కరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- సీతమ్మధార : పీసా 1996 చట్టం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 23, 24వ తేదీల్లో విశాఖపట్టణం వేదికగా పీసా మహోత్సవ్ నిర్వహించనున్నట్లు కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ ముక్తా శేఖర్, ఏపి పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ వెల్లడించారు. ఈ మేరకు పటిష్ట ఏర్పాట్లు చేశామని, పది రాష్ట్రాల నుంచి 1500 మంది క్రీడాకారులు విచ్చేస్తున్నారని, వారి భాగస్వామ్యంతో కబడ్డీ, ఆర్చరీ పోటీలు, గిరిజన సంస్కృతులను, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా పీసా మహోత్సవ్ మస్కట్ కృష్ణ జింక, పీసా రన్ టీషర్టులను, టోపీలను ఆవిష్కరించటంతో పాటు, మహోత్సవ్ బెలూన్‌ను ఎగుర వేశారు.సోమవారం సాయంత్రం స్థానిక పోర్టు స్టేడియంలో విలేకరుల సమావేశంలో ఉత్సవ్ వివరాలను వెల్లడించారు.. 23న ఉదయం 6 గంటలకు ఆర్కే బీచ్ రోడ్డులో 10కె పీసా రన్ జరుగుతుందని, 9 గంటలకు పోర్టు ఇండోర్ స్టేడియంలో కబడ్డీ మ్యాచ్‌లు, . 10 గంటల నుంచి క్రికెట్ స్టేడియంలో మహిళలు, పురుషుల జట్ల ఆధ్వర్యంలో ఆర్చరీ పోటీలు జరుగుతాయని వివరించారు. అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి క్రీడాకారులు, అధికారులు, గిరిజన ప్రజల ఆధ్వర్యంలో డెమో క్రీడాపోటీలు జరుగుతాయని, 24న ఉదయం 11గంటల నుంచి కళావాణి స్టేడియంలో వివిధ రాష్ట్రాల సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయన్నారు.. రెండు రోజుల కార్యక్రమాల్లో భాగంగా గిరిజనులు తయారు చేసిన వివిధ రకాల వస్తువులతో కూడిన స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పీసా మహోత్సవ్ లో అందరూ భాగస్వామ్యమై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రైల్వే కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి- మాధవధార : ఉత్తరప్రదేశ్ లక్నోలో అఖిలభారత రైల్వేమెన్స ఫెడరేషన్ వార్షిక సర్వసభ్య సమావేశాల్లో హాజరయ్యేందుకు వెళ్లిన ఈస్టుకోస్ట్ రైల్వే శ్రామిక యూనియన్ వాల్తేర్ డివిజనల్ కోఆర్డినేటర్ పి.రామ్మోహనరావు అక్కడ జాతీయ నాయకులను కలిసి, సమస్యలపై విన్నవించారు. ఎఐఆర్ఎఫ్ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రాను ఆయన నివాసంలో రామ్మోహనరావుకలిశారు . సమావేశంలో ఎఐఆర్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు కన్నయ్య, కోశాధికారి, సౌత్ సెంట్రల్ రైల్వే సౌత్‌కోస్ట్ రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్ శంకరరావు, ఇతర జాతీయ నేతలను కలిసారు. ఈసందర్భంగా సౌత్‌కోస్ట్ జోన్ ఏర్పాటు మూలంగా వాల్తేరుడివిజన్ కార్మికులకు ఎదురయ్యే సమస్యలను విన్నవించి, వాటిని రైల్వేబోర్డు స్థాయిలో చర్చించిసరిచేసేందుకు యూనియన్ ద్వారా కృషి చేయాలని కోరారు. కొత్తజోనల్ కార్యాలయంలో నియామకాలకు ఇటీవల రైల్వేబోర్డు విడుదల చేసిన మార్గదర్శకాలు స్థానిక ఉద్యోగుల హక్కులకు భంగంకలిగించేవిగా ఉన్నాయని వివరించారు.

రామకృష్ణాపురం గ్రామాభ్యుదయ సంఘం
అధ్యక్షుడిగా బాబూరావు

వంకర బాబూరావు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు, కేంద్రకారాగారం ఎదురుగా గల రామకృష్ణాపురం, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గ్రామ అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షుడిగా వంకర బాబూరావు ఎన్నికయ్యారు. ఆదివారం బ్యాలెట్ పద్ధతిలో జరిగిన ఎన్నికల్లో బాబూరావు ప్రత్యర్థి అభ్యర్థిపై 100 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. బాబూరావు గెలుపొందటం ఇది రెండవసారి. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

ఐటి హిల్స్‌లో త్వరితగతిన సౌకర్యాలు

ప్రజాశక్తి-మధురవాడ : మధురవాడ ఐటీ హిల్స్ ప్రాంతంలో యుద్ధ ప్రాతిపదికన రోడ్లు, డ్రైయిన్లు, లైట్లు, బ్యూటిఫికేషన్ వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు.. ఐటీ హిల్స్‌లో ప్రతిపాదించిన అభివృద్ధి పనుల పురోగతిపై సోమవారం ఎంవిపి కాలనీలోని తన నివాసంలో ఎపిఐఐసి ఇంజినీర్లతో సమీక్షించారు. కాగ్నిజెంట్, ఫ్లూయంట్ గ్రిడ్, ఇమాజినేటివ్, సత్వా తదితర ప్రముఖ ఐటీ సంస్థలకు ప్రభుత్వం శంకుస్థాపన చేసిన నేపథ్యంలో మౌలిక వసతుల కల్పన వేగంగా జరగాలని ఆదేశించారు. నాణ్యతలో రాజీ పడకుండా నిర్దేశించిన గడువు లోగానే పనులు పూర్తి కావాలన్నారు. విశాఖను మోడల్ ఐటీ హబ్‌గా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ అన్ని చర్యలు తీసుకుంటున్నారన్నారు.

ఇంజినీర్లతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే గంటా

ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రత్యామ్నాయ ఉపాధికి హామీ

గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారి ప్రత్యామ్నాయ ఉపాధిక భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. భీమిలి రూరల్, ఆనందపురం, పద్మనాభం మండలాలను జివిఎంసిలో విలీనం చేయాలని ప్రభుత్వ నిర్ణయం నేపథ్యంలో 50 మందికి పైగా ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంవీపీ కాలనీలోని తన నివాసంలో ఎమ్మెల్యే గంటాను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. విలీనం కారణంగా తాము ఉద్యోగాలు కోల్పోతామని, అర్హతలను బట్టి జీవీఎంసీలో ఉపాధి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గతంలో కాపులుప్పాడ తదితర ప్రాంతాల విలీన సమయంలో మాదిరిగానే ఉద్యోగ భద్రత కల్పిస్తామని గంటా భరోసా ఇచ్చారు. విలీనం కారణంగా ఉత్పన్నమయ్యే సమస్యల గురించి ఇప్పటికే మున్సిపల్ మంత్రి నారాయణతో చర్చించానని తెలిపారు.

గంటాను కలిసిన లొడగల కృష్ణ

విశాఖ జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శిగా నియమితులైన లొడగల కృష్ణ సోమవారం ఎంవీపీ కాలనీలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కృష్ణను దుశ్శాలువాతో సత్కరించిన గంటా, పార్టీ ప్రతిష్ట పెంచేలా పనిచేయాలని, రానున్న స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు.

వార్డు సమస్యలపై వినతి

ప్రజాశక్తి- భీమిలి : జివిఎంసి మూడో వార్డులోని సమస్యలను పరిష్కరించాలని మాజీ కౌన్సిలర్ గంటా నూకరాజు కోరారు. సోమవారం జివిఎంసి ఒకటో జోన్ కార్యాల యంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. పాతబస్‌స్టాండ్‌వ ద్ద మాజీ మంత్రి ముత్తంశెట్టి కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న ఖాళీస్థలంలో కల్యాణమండపం, షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని కోరారు. బోయవీధిని ఆనుకుని సముద్రతీరం వెంబడి రక్షణగోడ నిర్మించాలని, ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి పిఎన్ఎం స్కూల్ వరకు రహదారి పునర్నిర్మాణం, కృష్ణా కాలనీ, ఎగువపేట,నేరెళ్లవలస కాలనీ, రెల్లివీధి ప్రాంతాల్లో రోడ్లు, సిమెంట్ కాలువలు నిర్మించాలని కోరారు.

తగరపువలస : జీరుపేట రోడ్డు సమస్యపై సోమవారం జోనల్ కార్యాలయంలో రెండో వార్డు జనసేన అధ్యక్షుడు నీలపు శంకర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. రోడ్డు విస్తరణ జరుగుతున్నందున తాత్కాలికంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని జెడ్‌సి హామీనిచ్చారు. సెక్రటరీ నాగేశ్వరరావు నర్సింగ్, శేషు. పాల్గొన్నారు

ఉల్లాసంగా ఫ్రెషర్స్‌డే

ప్రజాశక్తి- వేపగుంట : నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి.మాజీ డిజిపి నండూరి సాంబశివరావు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు ఫస్టియర్ విద్యార్థులకు సెకెండియర్ విద్యార్థులు, ఆత్మీయంగా స్వాగతం పలికారు. .ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. అనంతరం అకడమిక్ టాపర్లకు, వివిధ క్రీడా పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. విశిష్ట అతిథులుగా ఇన్ఫోసిస్ వైజాగ్ డెవలప్‌మెంట్ సెంటర్ హెడ్ నండ సురేష్, కాగ్నిజెంట్ డైరెక్టర్ సతీష్ కుమార్ మామిడి పాల్గొన్నారు. కాలేజ్ ఫౌండర్ చైర్మన్ కె.వి. సత్యనారాయణ, వైస్ చైర్మన్ పి. సుబ్బరాజు, డైరెక్టర్లు బి. భాస్కరరావు, పి. వెంకటేశ్వర్‌రావు, పి. ప్రకాష్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి. ప్రదీప్ వర్మ పాల్గొన్నారు.

ఫాగింగ్ పరిశీలన

ప్రజాశక్తి-ములగాడ: జివిఎంసి 60వ వార్డు మల్కాపురం ఏరియాలో సోమవారం మలేరియా ఇనిస్పెక్టర్ డి.రవికుమార్ పర్యవేక్షణలో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. స్థానిక కార్పొరేటర్ డాక్టర్ పీవీ సురేష్ పరిశీలించారు. మలేరియా సూపర్ వైజర్ డి శ్రీనివాస రావు, ఎంఐజికాలనీ పార్క్ ప్రెసిడెంట్ రమాదేవి, బి సతీష్, బి సంతోష్, బొమ్మిడి శ్రీనివాస్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఇద్దరు ఎస్ఐల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభం పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు కొత్త ఎస్ఐలు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. లాఅండ్‌ఆర్డర్ ఎస్ఐగా సిహెచ్ సూర్యనారాయణ విధుల్లో చేరగా, ఆయన సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వచ్చారు. ఇలాగే క్రైం ఎస్ఐగా వెంకటరావు విధుల్లో చేరారు. విశాఖ ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై వచ్చారు.

నేత్ర సమస్యలకు ఆక్యులో ప్లాస్టి చికిత్స

ప్రజాశక్తి - ఆరిలోవ : నేత్ర లోపాల పరిష్కారంలో ఆక్యులో ప్లాస్టీ కీలక పాత్ర పోషిస్తుందని ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాల, జిఎంఆర్ క్యాంపస్ కన్సల్టెంట్స్, ఆప్తాల్మిక్ ప్లాస్టిక్ సర్జరీ, ఫేషియల్ ఏస్తెటిక్స్ వైద్యులు డాక్టర్ సునీత గవర, డాక్టర్ లావణ్య మద్ది అన్నారు. కంటి రెప్పలలో సంభవించు లోపాలు, కంటి నుంచి నీరు కారటం, కంటి పరిసరాలలోని లోపాలు, దృష్టి పనితీరు, కంటి రూపాన్ని సవరించడంలో ఆక్యులో ప్లాస్టీ చికిత్స కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఆక్యులో ప్లాస్టి, ఫేషియల్ రెండూ చికిత్సలలో అనుసంధానత కలిగి కంటి లోపాలను సవరిస్తుందన్నారు. ఇటీవల కాలంలో అనేక మంది కనురెప్పలు వాలిపోతున్నాయని, కళ్ళ వెంట నీరు కారుతుందని, పెరియోక్యులర్ వృద్ధాప్య సమస్యలు, కళ్ళ చుట్టూ వలయాలు ఏర్పడటం వంటి పలురకాల సమస్యలతో నేత్ర వైద్యులను సంప్రదిస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. వీటి వలన వారికి రోజు వారి పనిలో ఇబ్బందులు కలగటమే కాక ఆత్మవిశ్వాసం కోల్పోయేలా చేస్తుందన్నారు. ఇవి కేవలం కాస్మిటిక్ సమస్యలు మాత్రమే కాదని, వీటి వలన దృష్టి లోపం, రెప్పలు ఆర్పుటలో ఇబ్బందులు, నేత్ర బాహ్య సౌందర్యానికి ఆటంకం కలగవచ్చన్నారు. కంటికి ఎలాంటి సమస్య వచ్చినా అశ్రద్ధ చేయకూడదన్నారు. అది చిన్న లోపమైనా అది కంటిపై పెద్ద ప్రభావం చూపవచ్చన్నారు. కను రెప్పల లోపాలను, ప్టోసిస్, లాక్రిమల్ డిజార్డర్స్, కంటి గాయాలు, ట్యూమర్ వంటి వాటిని ఆక్యులో ప్లాస్టీ సర్జరీ ద్వారా నివారించవచ్చన్నారు.

డాక్టర్ సునీత గవర, డాక్టర్ లావణ్య మద్ది

అప్పన్న సన్నిధిలో జస్టిస్ షిండే దంపతులు

ప్రజాశక్తి- వేపగుంట : సింహాద్రి అప్పన్నను సోమవారం రాజస్థాన్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, మహారాష్ట్ర రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్ జస్టిస్ సంభాజీ శివాజీ షిండే తన సతీమణితో దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఎఇఒ కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారి కె.వెంకటేశ్వరరావు ప్రొటోకాల్ ప్రకారం స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం, బేడామండప దర్శనం, అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయవిశిష్టతను ఆలయ అర్చకులు జస్టిస్ షిండే దంపతులకు వివరించారు. ఆలయ ఎఇఒ స్వామి శేషవస్త్రంతో సత్కరించగా, అర్చకులుప్రసాదనాన్ని అందించారు. గోపాలపట్నం సిఐ సన్యాసినాయుడు బందోబస్తు కల్పించారు.

జాతీయ కరాటే పోటీల్లో సత్తా

ప్రజాశక్తి-ఆనందపురం : సామర్లకోటలో నిర్వహించిన 4వ ఇన్విటేషనల్ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఆనందపురం మండలం నీళ్లకుండీలు సాయి స్వామి వివేకానంద పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. సీనియర్ విభాగంలో ఎన్. ప్రేమకుమార్, కె. కార్తికేయ, జి. నితీష్, పి. హేమ సూర్య రెండు బంగారు, నాలుగు వెండి పతకాలను గెల్చుకున్నారు. జూనియర్స్ విభాగంలో డి. మోక్షిత, సిహెచ్. విద్యా, కె. భార్గవ సాయి, పియూష్ కుమార్ సింగ్‌లు మూడు గోల్డ్, ఐదు సిల్వర్ మెడల్స్ సాధించారని రాష్ట్ర కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ చీఫ్ కట్టమూరి బాబూజీ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు, హెచ్ఎం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాల సాధన లక్ష్యం

ప్రజాశక్తి- భీమిలి : టెన్త్‌లో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా ప్రణాళికా యుతంగా చదవాలని సాంఘిక సంక్షేమ శాఖ డిడి కె.రామారావు విద్యార్థులకు సూచించారు. సోమవారం మూడో వార్డులోని యోగాచైతన్యసంస్థ ఆవరణలో విశాఖ, భీమిలి డివిజన్లకు చెందిన 8 సాంఘిక సంక్షేమ వసతిహాస్టళ్లలోని76 మంది టెన్త్ విద్యార్థులకు ప్రేరణలో భాగంగా అవగాహన కల్పించారు . గతేడాది టెన్త్ లో జిల్లాలో 85 శాతం ఉత్తీర్ణత సాధించిన నేపథ్యంలో ఈఏడాది శత శాతం ఫలితాలు సాధించాలని కోరారు. దీనిపై హాస్టల్ సంక్షేమ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారుఈ సందర్భంగా పలు సబ్జెక్ట్ ల్లో నిపుణులతో అవగాహన కల్పించారు. ఒత్తిడికి గురి కాకుండా ఎలా చదవాలో వివరించారు కార్యక్రమంలో విశాఖ, భీమిలి డివిజన్ల ఎఎస్‌డబ్ల్యులు ఆర్ శ్యామల, కె కృష్ణారావు, వార్డెన్లు పాల్గొన్నారు

వార్షికోత్సవంలో బహుముఖ సేవలు

ప్రజాశక్తి- భీమిలి : స్థానిక కలిగొట్ల స్నిగ్ధశ్రీ ఫౌండేషన్ 9వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం చిన్నబజారు వద్ద ఫౌండేషన్ కార్యాలయంలో బహుముఖ సేవలు నిర్వహించారు. పేదలకు కుట్టుమిషన్లు, అందులైన మహిళల చదువు కొనసాగింపునకు రూ.15వేలు ఆర్థికసాయం, దుస్తులు, మారికవలసకు చెందిన 25 అంధ కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, దుస్తులు, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ.15వేలు విలువైన ప్రింటర్,ఐదు పేద కుటుంబాలకు వైద్యఖర్చులకు రూ.లక్ష సాయం, అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి, సభ్యులు, కె.సూర్యనారాయణమూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాస రావు, మాజీ కౌన్సిలర్ గంటా నూకరాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి తగరపువలస : సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని విశాఖ ఎంపీ శ్రీభరత్ భరోసానిచ్చారు. సోమవారం భీమునిపట్నం మండలం తాళ్లవలస పంచాయతీలో డిఎన్ రాజు ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై టిడిపి శ్రేణులు, స్థానిక ప్రజలతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కూటమి ప్రభుత్వం అదిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి కోరాడ రమణ, పతివాడ రాంబాబు, వి .దుర్గారావు, . మరగడ రఘురామిరెడ్డి, తెలుగుదేశం పార్టీ ప్రెసిడెంట్ చుక్క ఆదిరెడ్డి, ఎంపిసి డైరెక్టర్ చుక్క ఉమాదేవి పాల్గొన్నారు

'ఉపాధి హామీ'కి కేంద్రం తూట్లు

చట్ట సవరణపై అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో నిరసనలు

అనకాపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని కోరుతూ, ఈ చట్టానికి కేంద్ర ప్రభుత్వం చేసి సవరణలకు వ్యతిరేకంగా సోమవారం అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్ అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఆర్ దొరబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శంకర్రావు మాట్లాడుతూ 2005లో వామపక్షాల ఒత్తిడితో యుపిఎ-1 ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టం ద్వారా గ్రామీణ కూలీలకు పని హక్కు కాగా, నేడు మోడీ ప్రభుత్వం విబి- జిఆర్ఎఎం జి పేరుతో సవరణ చేసి దీనిని ఒక సాధారణ పథకంగా మార్చి ఉపాధిహామీ చటాన్ని నిర్వీర్యం చేయడానికి పూనుకుందని విమర్శించారు. ఉపాధి హామీ జాబ్ కార్డులను హేతుబద్ధీకరణ పేరుతో పెద్ద సంఖ్యలో తొలగించారన్నారు. మరో వైపు కేంద్ర ప్రభుత్వ ఇచ్చే నిధులు 90 శాతం నుండి 60 శాతానికి తగ్గించి రాష్ట్రాలపై భారం మోపుతుందని తెలిపారు. దీని వల్ల మన రాష్ట్రంపై ఏటా సుమారు రూ.4వేల కోట్లు అదనపు భారం పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు వివి శ్రీనివాసరావు, అల్లు రాజు బి.ఉమామహేశ్వరరావు, నాయకులు గండి నాయన బాబు, కర్రి అప్పారావు, కె.తేలయ్యబాబు, కే సుభాషిణి, సిపిఐ జిల్లా నాయకులు వైయన్ భద్రం, కే శంకర్రావు, ఫణీంద్ర, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : సిపిఎం ఆధ్వర్యాన స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం ఎంపీడీవో ఉషారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ నాయకులు వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వానికి కీలక మద్దతుగా వున్న తెలుగుదేశం, జనసేన పార్టీలు ఎంజిఎన్ఆర్ఇజిఎకు సవరణలను ఉపసంహరించుకునేటట్లు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, ఎస్ బ్రహ్మాజీ, కాండ్రేగుల రాము, పెంటకోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తి వేయడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుందని సిఐటియు మండల కార్యదర్శి ఈర్లే నాయుడు బాబు, సిపిఎం మండల నాయకులు వనుము సూర్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని ఏ.కోడూరు గ్రామంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సూరెడ్డి మల్లేశ్వరరావు, పెనగంటి దేవుడి నాయుడు, సూరి దేవుడు, గోపి తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో నిరసన తెలుపుతున్న ఉపాధి హామీ కూలీలు

దేవరాపల్లి : విబి-జిఆర్ఎఎం జీను ఉపసంహరించుకొని ఎంజిఎన్ఆర్ఇజిఎను కొనసాగించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న డిమాండ్ చేశారు. దేవరాపల్లిలో సంఘం ఆధ్వర్యాన సోమవారం కూలీలతో కలిసి నిరసన తెలిపారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని, లేకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి.నాగేశ్వరరావు, డి.శంకర్రావు, మామిడి దేముడు, బి.గణేష్, పి.శ్రీరాములు, కె.రాము, బి.వెంకటరమణ కూలీలు పాల్గొన్నారు.

ఎ.కోడూరులో రాస్తారోకో చేస్తున్న దృశ్యం

విశాఖ కలెక్టరేట్ : ఎంజిఎన్ఆర్ఇజిఎకు కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని, ఆ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె.రెహమాన్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.మణి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యాన సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర కూటమిలో ఉన్న సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దీనిపై మౌనం దాల్చడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు కె. సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, సిపిఎం జిల్లా నాయకుడు వి.కృష్ణారావు, సిపిఐ ఎంఎల్ ప్రజాపోరు నాయకుడు కె.దేవా, వామపక్ష పార్టీల నాయకులు ఎం.పైడిరాజు, ఎం.మన్మధరావు, ఎన్.నాగభూషణం, కె.వనజాక్షి, సిఎన్.క్షేత్రపాల్, జి.రాంబాబు, పి.సూర్యకుమారి, జి.జయ, ఎ.దేముడమ్మ, ఎన్.అప్పన్న, వి.నల్లయ్య పాల్గొన్నారు.

కలెక్టర్‌కు కాంగ్రెస్ లేఖ

అనకాపల్లి : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టానికి పేరు మార్చడం, రద్దు చేయడం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ చైర్మన్ బొంతు రమణ, నాయకులు పొలమరశెట్టి ఆదిమూర్తి, బుద్ధ మహేష్, కాంగ్రెస్ నాయకులు మలపురెడ్డి కోటేశ్వరరావు, కాళ్ళ సత్యనారాయణ, బోయిన భానుమూర్తి యాదవ్, సేనాపతి రాజు, ఆర్ఆర్ నాయుడు, కాపారపు సత్యనారాయణ పాల్గొన్నారు.

మునగపాకలో ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు

యోగా పోటీల్లో శ్రీకృష్ణ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా యోగా పోటీల్లో శ్రీకృష్ణ యోగా సెంటర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పలు బహుమతులు అందుకున్నారు. అనకాపల్లి లోటస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గవరపాలెం మల్ల జగన్నాథం ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన పోటీల్లో బి.నరసింగరావు 60 సంవత్సరాల పైబడిన విభాగంలో ప్రథమ బహుమతి, 50 నుంచి 60 సంవత్సరాల విభాగంలో ఆర్.వెంకట కుమార్ ప్రథమ బహుమతి, బి.జయశ్రీ 12 నుంచి 14 సంవత్సరాల విభాగంలో ప్రథమ బహుమతి, కే శశాంక ఐదవ స్థానం, ఎనిమిది నుంచి 11 సంవత్సరాల విభాగంలో జి ప్రసన్న, ఎన్ హేమ వెంకట్ తృతీయ స్థానం, జి సంపత్ గుణశ్రీ ఐదవ స్థానం పొందారు. వీరిని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు కర్రి బాబి, నడిపల్లి గణేశ్వరరావు, బూసి బాబు, జమ్మి, గణపతి, అజయ్, సూరిబాబు, శ్రీను, చంటి, ఆర్టీసీ సత్యనారాయణ తదితరులు అభినందించారు.

మెడల్స్ చూపుతున్న శ్రీకృష్ణ యోగా సెంటర్ విద్యార్థులు

పిజిఆర్ఎస్‌కు 344 అర్జీలు

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి : తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో పిజిఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారుల సమస్యలను సంబంధిత అధికారులు వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి వారు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలని వివిధ శాఖల జిల్లా అధికారులను కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో కలెక్టర్, డిఆర్వో, వై.సత్యనారాయణరావు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. మొత్తం 344 అర్జీలు స్వీకరించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పిజిఆర్ఎస్ జిల్లా సమన్వయ అధికారి ఎస్ సుబ్బలక్ష్మి, సిపిఓ జి.రామారావు, మెప్మా, డిఆర్‌డిఎ, ఐసిడిఎస్, గృహనిర్మాణ పీడీలు కె సరోజినీ, శచిదేవి, సూర్య లక్ష్మి శ్రీనివాస్, డిఈఓ జి.అప్పారావు నాయుడు, జిల్లా ఎక్సైజ్ అధికారి వి.సుధీర్, డిఎఈఓ వినోద్ బాబు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికలో 36 ఫిర్యాదులను స్వీకరించినట్లు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించి 7 రోజుల్లోపు విచారణ పూర్తిచేసి తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టెక్నికల్ వర్క్‌షాప్‌లో పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కశింకోట : అవంతి ఇంజనీరింగ్ కాలేజీలో రెండు రోజుల పాటు నిర్వహించిన టెక్నికల్ వర్క్ షాప్ (సృజన - 2కే25)లో స్థానిక ఆర్ఇసిఎస్ పాలిటెక్నిక్ చివరి సంవత్సరం ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు ప్రతిభ చూపారు. వీరు రూపొందించిన స్త్రీ రక్షణ బూట్లు ప్రాజెక్టుకు ప్రథమ బహుమతి లభించినట్లు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఉమా శంకర్ సోమవారం తెలియచేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులు కుమార్, భరత్, జ్యోతి చంద్ర, విజయ్ కుమార్‌లను, గైడ్ లెక్చరర్ సౌజన్య రాణిని, ఎలక్ట్రికల్ విభాగం హెడ్ రమణ కుమార్‌ను కళాశాల ప్రిన్సిపాల్, అసోసియేట్ ప్రిన్సిపాల్ కర్రి శివ అభినందించారు.

మండల స్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్టు

ప్రజాశక్తి-చోడవరం : చెల్లూరి ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని జుత్తాడ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. 14 పాఠశాలలు నుంచి 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో పూర్ణచందు(జడ్పీహెచ్ జుత్తాడ)కు ప్రథమ బహుమతి, రూపేంద్ర (జడ్పీహెచ్ గౌరీపట్నం) ద్వితీయ బహుమతి, దేవ హర్ష (జడ్పీహెచ్, లక్కవరం) తృతీయ బహుమతి లభించింది. అలాగే ఏడు పాఠశాలల విద్యార్థులు కన్సొలేషన్స్ బహుమతులు గెలుపొందారు. కార్యక్రమంలో చెల్లూరు లక్ష్మీపతి, కృష్ణమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషగిరిరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని రావాడ పంచాయతీ పరిధి ధర్మారాయుడుపేట గ్రామంలో డ్రైనేజీ నిర్మాణ పనులను వైస్ ఎంపిపి బంధం నాగేశ్వరరావు, రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు సోమవారం ప్రారంభించారు. జెడ్‌పిటిసి పైల సన్యాసిరాజు జెడ్‌పి నిధులు నుండి రూ.2.10 లక్షలు మంజూరు చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కెవి.అప్పలరాజు, జెర్రిపోతుల రాము తదితరులు పాల్గొన్నారు.

పిపిగా సూర్యనారాయణ నియామకం

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం 9వ అడిషనల్ డిజిటల్ జడ్జి కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా చీపురుపల్లి సూర్యనారాయణను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సూర్యనారాయణను ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, టిడిపి నాయకులు గూనూరు మల్లు నాయుడు, గూనూరు పెదబాబు, పసుమర్తి సాంబ, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు మత్స్యరాజు, రొంగలి రమణ తదితరులు సన్మానించారు.

జిల్లాస్థాయి పోటీల్లో దివ్యశైలుకు ప్రథమ బహుమతి

ప్రజాశక్తి-కశింకోట : జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కశింకోట జెడ్‌పి హైస్కూల్‌లో జిల్లా స్థాయిలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించి పోటీల్లో కూండ్రం జెడ్‌పి హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి ఎ.దివ్య శైలు డిజిటల్ న్యాయం అన్న అంశం రాసిన వ్యాసానికి ప్రథమ బహుమతి లభించింది. ఈ మేరకు దివ్యశైలును, ఆమెను గైడ్ టీచర్‌గా వ్యవహరించిన తెలుగు ఉపాధ్యాయులు కోరాడ అప్పలరాజును పాఠశాల హెచ్ఎం ఎన్.సన్యాసినాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

జిఒ 1491కు సవరణ చేయాలని వినతి

ప్రజాశక్తి- మునగపాక : మునగపాక మండలాన్ని కొత్తగా ఏర్పాటు చేసే నక్కపల్లి రెవెన్యూ డివిజన్‌లో విలీనం చేస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెంబర్ 1491కు సవరణ చేయాలని వైసిపి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అనకాపల్లి కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లో కొనసాగించాలని, ప్రభుత్వం ఇచ్చిన 1491 జిఒను సవరించాలని మండలంలోని 26 గ్రామ పంచాయతీల గ్రామసభల్లో తీర్మానం చేసి వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చియ్యనాయుడు, నాయకులు బొడ్డేడ శ్రీనివాసరావు, సుందరపు నీలకంఠస్వామి, కాండ్రేగుల జగన్, చదరం గణేష్‌నాయుడు పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ఎ ఆధ్వర్యాన అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-యస్.రాయవరం : మండలంలో చిన్నగుమ్ములూరు, దార్లపూడి గ్రామాలలో మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఆదేశాలు మేరకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించినట్టు యలమంచిలి కోర్ట్ ప్యానెల్ లాయర్ టి.నూకరాజు తెలిపారు. గవర్నమెంట్ హైస్కూల్‌లో చైల్డ్ మ్యారేజ్ యాక్ట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీస్‌లు అంగన్వాడీ, హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది పోల్గిన్నారు.

మారుమూల గిరిజన పల్లెలకు రోడ్ల నిర్మాణం

మాట్లాడుతున్న బాలు నాయక్

ప్రజాశక్తి-దేవరాపల్లి : రాష్ట్రంలోని మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్లు నిర్మించి రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మక చర్యలు చేపడుతోందని పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్ బి.బాలునాయక్ పేర్కొన్నారు. అనంతగిరి మండలం బల్లగరువు, తునుసుబ, దాయర్తి, వాజంగి, పీసుమామిడి, గుమ్మంతి, రెడ్డిపాలెం, మద్రాబా తదితర గ్రామాల్లో జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనులను సోమవారం ఆయన స్థానిక అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం దేవరాపల్లి మండల కేంద్రంలోని రైవాడ జలాశయ అతిథి గృహం వద్ద బాలు నాయక్ విలేకరులతో మాట్లాడారు. అడవి తల్లి బాట పథకం ఆదివాసీలకు రవాణా ఇబ్బందులు లేకుండా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వ పీఎం జన్‌మన్ పథకం మొదటి దశలో భాగంగా రూ.557 కోట్ల వ్యయంతో 239 గిరిజన ఆవాసాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రస్తుతం 206 రోడ్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయని, వీటిలో ఇప్పటికే 32 బీటీ రోడ్లు పూర్తయ్యాయని తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి 160 రోడ్లను, ఆగస్టు నాటికి మిగిలిన 46 రోడ్లను పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అటవీ శాఖ అనుమతులు కొంత అడ్డంకిగా మారినప్పటికీ, ఇప్పటికే 128 పనులకు అనుమతులు సాధించామని వివరించారు. అకాల వర్షాల వల్ల పనుల్లో కొంత జాప్యం జరిగిన మాట వాస్తవమేనని, అయితే ఇకపై పనులు వేగవంతం చేసేందుకు కాంట్రాక్టర్లతో వైజాగ్‌లో ప్రత్యేకంగా సమీక్షించనున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో ఎస్ఈ కె.శ్రీనివాసరావు, పాడేరు ఈఈ కొండయ్య పడాల్, అరకు డిఈఈ రామం, ప్రాజెక్ట్ డిఈ రవికుమార్, మాడుగుల డిఈఈ ఏ.శ్రీనివాసరావు, దేవరాపల్లి పిఆర్ ఇన్చార్జి ఏఈ పి.సుమతి తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న వైసిపి నేత భరత్‌కుమార్

ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కశింకోట : మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు మండలంలోని త్రిపురానిపాలెంలో ఆదివారం రాత్రి వైస్ ఎంపిపి నమ్మి మీనా గణేష్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఇందులో వైసిపి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మలసాల కుమార్ రాజా, మలసాల కిశోర్, ఎపిపి కలగ లక్ష్మి గున్నయ్యనాయుడు, కరక స్వామినాయుడు, గ్రామ సర్పంచ్ కలిగట్ల నూకరత్నం నాయుడు, నమ్మి నరసింహ, జోగా శ్రావణ్‌కుమార్, నమ్మి సదీష్, నమ్మి జగదీష్ పాల్గొన్నారు.

ప్రజా సంకల్ప వేదిక ప్రధాన కార్యదర్శిగా అప్పలరాజు

ప్రజాశక్తి-పరవాడ : ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన అర్జిల్లి అప్పలరాజు నియమితులయ్యారు. ఈ మేరకు వేదిక రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది మధిరె రంగసాయి రెడ్డి సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

యలమంచిలి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో యలమంచిలి పురపాలక సంఘ సభ్యులు, యలమంచిలి మండల పరిషత్ సభ్యులు, యలమంచిలి పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ కాపీలను అనకాపల్లి ఎంపీ సి.ఎం.రమేష్‌కి, అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు సాధన సమితి ప్రతినిధులు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ సోమేశ్వరరావు, మాజీ పిఏసిఎస్ ఛైర్మన్ మల్ల కొండబాబు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆడారి పూరి జగన్నాథం, నక్కా శివశంకర్, ఎల్లపు రాజు అందజేశారు.

గర్భకోశ చికిత్స శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గాలిభీమవరం గ్రామంలో పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన ఉచిత పశుగర్భకోశ చికిత్స శిబిరానికి స్పందన లభించింది. విశాఖపట్నం పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్, ఈవో డిఎల్‌డిఏ ఎస్.శ్రీనివాసరావు, సర్పంచ్ గొర్లె రాజేష్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 46 పశువులకు గర్భకోశ చికిత్సలు, 34 లేగ దూడలకు నట్టల నివారణ మందులు ఉచితంగా పంపిణీ చేసినట్లు ఆరిపాక పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్.స్వర్ణలత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బొండా శేషు కుమారి, మాజీ సర్పంచ్‌లు వాకాడ గోవింద రావు, నీటిపల్లి రమణ, పాల సంఘం ప్రెసిడెంట్ గొర్లె వెంకట రమణ, వాకాడ కనకరాజు, గొంప అప్పారావు, డాక్టర్ కె.ఉష కుమారి, డాక్టర్ జి.అరుణ, డాక్టర్ సౌజన్య, డాక్టర్ సంధ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని బాట జంగాలపాలెం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ పడాల వెంకటరమణ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డ్ మెంబర్ గొర్లి నూకరాజు, పందిరిపల్లి పెల్లి రాము, పోతల శ్రీనివాస్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కళ్యాణి, వర్క్ ఇన్స్పెక్టర్ గొరేష్, కుమార్, వేరుపల్లి శ్రీను, కూటమి నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకట రమణ

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కేపీ అగ్రహారం గ్రామానికి చెందిన దేవర చిలకమ్మకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.3,59,000 చెక్కును సోమవారం స్థానిక శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్.రాజు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ దేవర అప్పారావు, టిడిపి నాయకులు అడ్డూరి శ్రీను, తూరుబిల్లి నూకరాజు, ఎస్ వరలక్ష్మి, వియ్యపు నాగేశ్వరరావు, దేవర బుల్లినాయుడు, నాయుడు, మత్స్యరాజు, ముచ్చర్ల తాతీలు, ఎస్.శ్రీరామ్మూర్తి, దొండా గిరిబాబు పాల్గొన్నారు.

యస్.రాయవరం : మండలంలోని తిమ్మాపురం, ధర్మవరం గ్రామాలలో ముఖ్యమంత్రి సహాయక నిధుల చెక్కులను మండల టిడిపి నాయకులు అందజేశారు. అడ్డరోడ్డు తిమ్మాపురంలో గుర్రం రవి కిరణ్ కుమార్ నాలుగు నెలల క్రితం ప్రమాదంలో గాయపడగా, ఆస్పత్రి వైద్యం ఖర్చులు నిమిత్తం రూ.41,084 చెక్కు అందజేశారు. ధర్మవరంలో కందుల రాము దంపతులకు సుంకర శ్రీనివాస్; అబద్దం చేతులమీదగా రూ.55.616 చెక్కుని అందించారు. ఈ కార్యక్రమంలో గుర్రం రామకృష్ణ, అల్లు నరసింహ మూర్తి, పప్పల శివ, వంగలపూడి గోవింద్, కట్టా అప్పలకొండ పాల్గొన్నారు.

అనకాపల్లిలో రైతు బజార్ ఏర్పాటుచేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లిలో రైతు బజారు ఏర్పాటుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కొణతాల హరినాథ్ బాబు డిమాండ్ చేశారు. రైతు బజారు ఏర్పాటు చేయాలని కోరుతూ అనకాపల్లి నెహ్రూ చౌక్ సెంటర్లో ఆమ్ ఆద్మీ పార్టీ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 24వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కష్టించి పండించిన కూరగాయలను అనకాపల్లిలో రైతు బజారు లేకపోవడంతో దళారీల చేతుల్లో మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దీక్షలకు సిద్ధార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్ల నాగభూషణం సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ ప్రకాష్, ఎల్లపు రామశేషు, గొర్లి వెంకట్రావు, ఎం విజయ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈనెల 24న స్థానిక ఎన్టీఆర్ ఆసుపత్రిలో విశాఖ ఎబిలిటీ పీపుల్, రోటరీ క్లబ్ సంయుక్తంగా నిర్వహించే ఉచిత ఫిజియోథెరపీ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ భీమరశెట్టి రామ్కి తెలియజేశారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ప్రియాంక ప్రోత్సాహంతో, ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి డిసిహెచ్ఎస్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్, జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సహకారంతో జరిగే ఈ క్యాంపులో పలు వ్యాధుల నివారణకు ఉపయోగపడే ఫిజియోథెరపీ చికిత్సలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తాడి రామకృష్ణ, మంగ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పట్టాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని కే.కోటపాడు మండలం ఆర్లి, మర్రివలస, దాలివలస గ్రామాల్లో మూడు తరాలుగా బంజరు భూములను సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న పేద రైతులకు పట్టాలు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో అనకాపల్లి కలెక్టర్ ఆఫీస్ వద్ద రైతులు ధర్నా నిర్వహించి కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ రైతులకు పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి సాగు చేసుకుంటున్న రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జి.ఫణీంద్ర కుమార్, గొర్లె దేవుడు బాబు, బాబ్జీ, శంకర్రావు, అప్పలనాయుడు, రైతులు దమ్ము ముత్యాల నాయుడు, దేముడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బిల్లులు సిఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో సబ్మిట్ చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : పాఠశాలలకు సంబంధించిన ప్రతి బిల్లు పిఎఫ్ఎంఎస్ ద్వారా కాక అకౌంట్ ద్వారా సిఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో సబ్మిట్ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. జీవీఎంసీ పట్టణ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం జిల్లాలోని పీఎంశ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు/ ప్రిన్సిపాల్స్‌తో ఎస్ఎస్ఏ స్పార్క్ ఫైనాన్స్ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త విధానాన్ని విధిగా చేయాలని, ప్రస్తుతం విడుదలైన వివిధ గ్రాంట్స్ కూడా ఇదే విధానంలో సబ్మిట్ చేయాలన్నారు. పదో తరగతి యాక్షన్ ప్లాన్ కట్టుదిట్టంగా అమలు చేసి శతశాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ శేఖర్, ఖగేష్, ఏఎమ్ఓ కెజియా పాల్గొన్నారు.

పల్స్ పోలియో నిర్వహణపై పర్యవేక్షణ

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట సచివాలయం-1 పరిధిలో పల్స్ పోలియో నిర్వహణ తీరును జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నర్సింగరావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ చంద్ర శేఖర్ దేవ్ సోమవారం పరిశీలించారు. పోలియో చుక్కలు వేయకుండా మిగిలిన పిల్లల సంఖ్య ఇతర విషయాలను వైద్య అధికారి ఎస్.తిరుపతిరావును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ యసోద, ఏంపిహెచ్ఇఒ సత్య నారాయణ, సిహెచ్ఓ నవ్య పాల్గొన్నారు. వేదురుపర్తి ఇటుక బట్టీలు వద్ద ప్రత్యేక పోలియో క్యాంపు నిర్వహించారు. వైద్య సిబ్బంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. తాళ్లపాలెం ఆరోగ్య కేంద్రం పరిధిలో డాక్టర్ మనీషా ఆధ్వర్యంలో పోలియో చుక్కలపై ఇంటి ఇంటి సర్వే చేశారు.

ఉపాధి హామీ సమన్వయ సమావేశం

ప్రజాశక్తి-యస్.రాయవరం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో 18 విడత సామాజిక తనిఖీలో భాగంగా సమన్వయ సమావేశం ఎంజిఎన్ఆర్ఇజిఎ అధికారి ఎరకయ్య ఆధ్వర్యాన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు అమలాకంటి అబద్దం మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని తెలిపారు. గడిచిన సంవత్సరం జరిగిన పనులు సామాజిక తనిఖీ పూర్తి పారదర్శకతతో చేయించాలని కోరారు. ఎంపిడిఒ మీనా కుమారి మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి రూ.22 కోట్ల 48 లక్షలు ఖర్చు చేయగా, ఇందులో వేతనాల రూపంలో రూ.18 కోట్ల 12 లక్షలు చెల్లించినట్లు చెప్పారు. సామాజిక తనిఖీ ఎస్ఆర్పి దాసు మాట్లాడుతూ ఈ సామాజిక తనిఖీకి ముగ్గురు డిఆర్పిలు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అనుచిత పోస్టుపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌పై మండలంలోని తురకలపూడి గ్రామానికి చెందిన మాజీ వాలంటీర్ అనుచిత పోస్ట్ పెట్టారంటూ జనసేన నాయకులు సోమవారం బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

25 నుండి గోవాడ సుగర్స్ వద్ద రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-చోడవరం : గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వద్ద ఈ 25వ తేదీ నుండి రిలే నిరాహార దీక్షలు ప్రారంభించినట్లు అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు తెలిపారు. సోమవారం ఫ్యాక్టరీ వద్ద నిరసన అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని సహకార రంగంలో అన్ని విధాల అగ్రగామిగా నడుస్తూ సుమారు 65 సంవత్సరాలకు పైగా సుదీర చరిత్ర కలిగి లక్షలాది రైతు కుటుంబాలకు జీవనోపాధిని కల్పిస్తున్న గోవాడ సుగర్స్‌లో నేటికీ క్రషింగ్ ప్రారంభించకపోవడం సరికాదన్నారు. రైతులు, కార్మికులకు బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు పప్పల జయదేవ్, ఎన్వీ నాయుడు, కార్మిక నాయకులు సరగడం రామ నాయుడు, జెర్రిపోతుల నానాజీ, మాజీ ఎంపీపీ మల్ల కోటేశ్వరరావు, మూడేడ్ల శంకర్రావు, దేవరపల్లి సత్య, వేచలపు ప్రకాష్, సోమిరెడ్డి నాయుడు, కోన చంద్రరావు, సిరిసిల్ల సత్యారావు, పొట్నూరు అప్పలరాజు, తాతారావు, గుమ్మడి శీను పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రైతు, కార్మిక నాయకులు

వివాహితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలి

-కలెక్టర్‌కు నిర్వాసితులు, సిపిఎం నేతల వినతి

నిర్వాసితులతో కలిసి మాట్లాడుతున్న అప్పలరాజు

ప్రజాశక్తి- నక్కపల్లి:వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా చేపట్టిన భూసేకరణలో నివాస గృహాలు కోల్పోయిన కుటుంబాల్లో వివాహితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేసి, పరిహారం చెల్లించి, ఇంటి స్థలం కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు. నక్కపల్లి మండలంలో భూసేకరణ ప్రభావిత గ్రామాలకు చెందిన నిర్వాసితులు, వివాహితులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ కు వినతి పత్రం అందజేసారు. నక్కపల్లి మండలం అమలాపురం పంచాయతీ మూలపర్ర, పాటిమీద, చందనాడ పంచాయతీ తుమ్మలపేట, తమ్మయ్యపేట, కర్రివారి వీధి, బుచ్చిరాజుపేట పంచాయితీ కొత్తూరు, రాజయ్యపేట పంచాయితీ బోయపాడు గ్రామాల్లో నివాస గృహాలు కోల్పోయిన కుటుంబాల్లో వివాహితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ చెల్లించి, ఇంటి నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. భూసేకరణ చేపట్టిన సందర్భంలో ఆనాటి రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు గ్రామసభలు నిర్వహించినప్పుడు ఇల్లులు కోల్పోతున్న కుటుంబాలలో వివాహం అయిన మహిళలకు కూడా ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ సమస్యపై ఇప్పటికే అనేకసార్లు అధికారులకు దరఖాస్తు చేసినప్పటికీ, నేటి వరకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేసారు. లబ్ధిదారులుగా గుర్తించి ఆర్ ఆర్ ప్యాకేజీ జాబితాలో తమ పేర్లు చేర్చి 0-5 సెంట్లు స్థలం, ప్యాకేజీ చెల్లించాలని కోరారు. అర్హులందరికీ ఆర్ కార్డు ఇవ్వాలన్నారు. పునరావాసకాలనీలో ఇల్లులు నిర్మించుకునే వరకు గ్రామాల్లో ప్రస్తుతం నివశిస్తున్న ఇల్లులను ఖాళీ చేయమని వత్తిడి చేయకూడదన్నారు. 2013 భూసేకరణ చట్టం సెక్షన్ 32 ప్రకారం పునరావాసకాలనీ లో విద్య, వైద్యం ఇలా 25 రకాల సౌకర్యాలు కల్పించాలని కోరారు. చందనాడ పంచాయతీ తమ్మయ్యపేటలో తక్కువ నష్టపరిహారం అంచనా కట్టిన ఇల్లులకు రీ సర్వే చేపట్టే వాస్తవ ధరలకు అనుగుణంగా ఇల్లులకు నష్టపరిహారం చెల్లించాలని, అదేవిధంగా సాగు భూములకు, సాగు,డీ ఫారం భూములలో గల తోటలకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు రావి చిన్ని, ఎస్.గోవింద్, ఎం.మహేష్ బాబు, దుర్గ,పద్మ,గోపమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదన పత్రాలు అందజేస్తున్న గ్రామస్తులు

పంచాయతీల ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలో పలు గ్రామ పంచాయతీల శివారు గ్రామాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాలకు చెందిన నాయకులు కోరారు. పంచాయతీరాజ్ పునర్విభజన చట్టానికి ప్రభుత్వం సవరణ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో కొత్త పంచాయతీల ఏర్పాటుపై శివారు గ్రామాల ప్రజలకు ఆశలు చిగురించాయి. మండలంలోని పెద తీనార్ల పంచాయతీ శివారు దొండవాకను, రాజయ్యపేట పంచాయతీ శివారు బోయపాడును, దేవవరం పంచాయతీ శివారు ఒడ్డిమెట్టను, గొడిచెర్ల పంచాయతీ శివారు కొత్తూరును, డొంకాడ పంచాయతీ శివారు కొత్తూరు గ్రామాలను ఆయా పంచాయతీల నుండి విడదీసి, కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం ఆయా గ్రామాలకు చెందిన నాయకులు డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావుకు ప్రతిపాదన పత్రాలను అందజేశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కిరణ్, సత్యం పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న దమయంతి

గ్రంథాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో ఉపమాక గ్రంథాలయాన్ని సోమవారం ప్రధమ శ్రేణి గ్రంథాలయాధికారి పి.దమయంతి సందర్శించి వార్షిక తనిఖీ చేపట్టారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి రికార్డులు, రిజిస్టర్లు తనిఖీ చేశారు. విద్యార్థులతో సభ్యత్వాలు నమోదు చేయాలని, గ్రంథాలయానికి పాఠకులు ఎక్కువ మంది వచ్చేలా చూడాలని, గ్రామపంచాయతీ నుండి రావలసిన గ్రంథాలయ పన్ను సకాలంలో జిల్లా గ్రంథాలయ సంస్థ నిధులకు జమ అయ్యేటట్టు చూడాలని గ్రంథాలయాధికారి కె.జనార్ధన్‌కు ఆమె సూచించారు.

గిరిజనులకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి- అనంతగిరి:మండలంలోని టోకూరు పంచాయతీ దొరగూడ, కొత్తవలస, బలియగూడ గ్రామాల్లోని గిరిజనులకు అల్లూరి వాకర్స్ సేవా సంస్థ ఆద్వర్యాన రగ్గులను పంపిణీ చేశారు. ఆయా గ్రామాలకు చెందిన 100 మంది కుటుంబాలకు రగ్గులు అందజేశామని సంస్థ కోఆర్డినేటర్ ప్రభార్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్, సిపిఎం నేత కిల్లో మోసియా, మాజీ సర్పంచ్ దొన్ను చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సిపిఎం నేత దేవన, పీసా కమిటీ సభ్యులు సోమేష్, లక్ష్మణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

పంచాయతీల్లో సమస్యలపై నివేదిక

టీం సభ్యులతో అధికారులు

ప్రజాశక్తి-రావికమతం: గ్రామపంచాయతీల అభివృద్ధి దిశగా గ్రామాలలో నెలకొన్న సమస్యలను తెలుసుకొని ఉన్నత స్థాయి అధికార యంత్రాంగానికి రిపోర్ట్ చేయడం జరుగుతుందని ఐఐటి విఎంఆర్డిఏ మాస్టర్ ప్లాన్ ప్రిపరేషన్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ అండ్ టీం లీడర్ డాక్టర్ తారకనాథ్ మజుందార్, డాక్టర్ గవరబ్ దాస్ మహాపాత్ర లు తెలిపారు. మండల కేంద్రం వెలుగు కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో మహేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. మండలంలో గల 28 గ్రామ పంచాయతీల్లో సమస్యలను తెలుసుకొని వాటిని వీఎమ్ఆర్డీఏకు రిపోర్ట్ చేయడం జరుగుతుందన్నారు. గ్రామాలలో అసంపూర్తిగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను, పంచాయితీ భవనాలు, చెత్తతో సంపద తయారీ కేంద్రాలు, పాఠశాల ప్రహరీలు, అంగన్వాడి, పాఠశాల భవనాలు, సీసీ డ్రైన్లు తదితర సమస్యలను తెలియజేస్తామన్నారు. ఎంపిడిఓ మహేష్ మాట్లాడుతూ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు గ్రామాలలో అసంపూర్తిగా నిలిచి ఉన్న పనులను గుర్తించి ఐఐటీ మాస్టర్ ప్లాన్ ప్రిపరేషన్ బృందం దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి ఎస్ డబ్ల్యుఓ వర్మ, డిప్యూటీ ఎంపీడీవో, ఆర్డబ్ల్యూఎస్ జెఈ భగవంతురావు, మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ, మండల టిడిపి పార్టీ అధ్యక్షులు కోమటి శంకర్రావు, రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాజనకొండ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని కొత్తమల్లం పేట నుంచి అమ్మపేట వరకు రూ.50లక్షలతో చేపట్టే తారురోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి సోమవారం మండల టీడీపీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు, చోద్యం కోపరేటివ్ సొసైటీ అధ్యక్షులు చిటికెల సాంబమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సహకారంతో ఈ నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో విప్పలపాలెం ఆయకట్టు నీటి సంఘం అధ్యక్షులు గొల్లు సత్యనారాయణ, చోద్యం కోఆపరేటివ్ మాజీ అధ్యక్షులు కొల్లాన కొండలరావు, అమ్మపేట సర్పంచ్ దేముడునాయుడు, అమ్మపేట మాజీ సర్పంచ్ గొర్లి రవి, గింజర్తి మాజీ సర్పంచ్ గెడ్డం సత్తిబాబు, డీఈఆర్ సత్యనారాయణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న నాయకులు

మాట్లాడుతున్న సిఐ రేవతమ్మ

బాల్య వివాహాలతో అనర్థాలు

ప్రజాశక్తి-నాతవరం :మండలంలోని డి.యర్రవరం గ్రామంలోని స్కూల్లో బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రేవతమ్మ మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలన్నారు. గంజాయి లేదా ఇతర డ్రగ్స్‌కు సంబంధించిన ఏవైనా సమాచారం తెలిసిన వెంటనే 112 లేదా 1972 నెంబర్లకు కాల్ చేసి తెలియజేయాలని కోరారు. పోక్సో చట్టం, ట్రాఫిక్ నియమాలు, బాల్యవివాహాల నిషేధం, కౌమార దశలో వచ్చే మార్పుల, ప్రభావాల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత విలువలతో ఎదిగి, బాధ్యతాయుత పౌరులుగా ఉండాలని ఆమె సూచించారు.

అధికారులతో సిబ్బంది

పంచాయతీ ఆదాయ వనరులపై శిక్షణ

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీర్ అసిస్టెంట్లు, వీఆర్వోలు, సర్వేయర్లుకు సోమవారం గ్రామ పంచాయతీల సొంత ఆదాయ వనరులు పెంపొందించేందుకు, సాంకేతిక వ్యూహాలు రూపొందించేందుకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిక్షణలో గ్రామ పంచాయతీల ఆదాయ వనరుల గుర్తింపు, పన్నులు, ఆస్తుల నిర్వహణ, డిజిటల్ పద్దతుల వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని చెప్పారు.

నువ్వుల సాగుతో అధిక ఆదాయం

ప్రజాశక్తి -నక్కపల్లి:రబీ సీజన్ లో రైతులు నువ్వులు సాగు చేయడంతో అదనపు ఆదాయం సమకూరుతుందని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ అన్నారు. మండలంలో సోమవారం చీడిక, గునుపూడి గ్రామాల్లో వ్యవసాయ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయి పర్యటన చేశారు. రైతులకు అపరాల సాగుపై అవగాహన కల్పించారు. ఖరీఫ్ పంట తర్వాత పొలాల్లో నిలిచి ఉన్న తేమను ఉపయోగించుకుని నువ్వులు సాగు చేయడంతో సుమారు 80 నుండి 90 రోజుల్లో రైతుకు అదనపు ఆదాయం వస్తుందని, ఎకరానికి 2కేజీలు వేసుకుంటే సరి పోతుందని రైతులకు తెలియజేశారు. వరి మాగాణుల్లో పంట మార్పిడి చేయడంతో చీడ పీడలు తగ్గుతాయని సూచించారు. 50 శాతం రాయితీపై నువ్వు విత్తనాలను గిరి రైతులకు అందజేశారు. విత్తన శుద్ధి పై అవగాహన కల్పించారు. నువ్వులలో నూనె శాతం ఎక్కువ ఉండటంతో మంచి మార్కెట్ లభిస్తుందని తద్వారా ఆదాయం వస్తుందన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని సాధించవచ్చునని, రైతులందరూ నువ్వులు సాగుపై ఆసక్తి కనబరచాలన్నారు. రైతులు రబీ లో ఈ- పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు సత్యనారాయణ, శ్రీనివాస్, సాయి, ఆర్ఎస్‌కె సిబ్బంది రజిత, శిరీష, రాజేష్, రైతులు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎఒ

ల్యాబ్ ను ప్రారంభిస్తున్న ఎంఈఓ

వేంపాడులో గణితం ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలో వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వరలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం గణిత మేధావి రామానుజన్ జయంతి పురస్కరించుకుని ఏర్పాటు చేసిన గణితం ల్యాబ్ను ఎంఈఓ కె నరేష్ తో పాటు సర్పంచ్ సూరకర్తం, ఉప సర్పంచ్ అయినంపూడి అప్పలరాజు, ఎంఈఓ 2 నాగన్న దొర ప్రారంభించారు. మండలంలో 13 ఉన్నత పాఠశాలలతో పాటు గురుకులం, కే.జీ.బీ.వి పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో రామానుజన్ జయంతి సందర్భంగా గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలలో హెచ్ఎంలు, గణిత ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో విద్యార్థులు తయారు చేసిన వివిధ గణిత నమూనాలు ప్రదర్శించారు. ఎంఈఓలు నరేష్, నాగన్న దొర పలు పాఠశాలలను సందర్శించి మాట్లాడారు. గణితంలో రామానుజన్ చేసిన అద్భుతమైన కృషిని విద్యార్థులకు వివరించారు. ప్రతీ విద్యార్థి గణితం ప్రాధాన్యతను తెలుసుకుని గణితంపై పట్టు సాధించాలన్నారు.

తిరువీధుల్లో వెంకన్న ఊరేగింపు

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మాడ వీధుల్లో పెద్ద పల్లకిలో వెంకన్నను ఊరేగించారు. ఉత్సవాల్లో భాగంగాశ్రీదేవి ,భూదేవి సమేత వెంకన్న ఉత్సవమూర్తులను పెద్ద పల్లకిలోనూ, గోదాదేవి అమ్మవారి ఉత్సవ మూర్తిని చిన్న పల్లకీలోను అధిష్టింప చేసి మాడవీధుల్లో అర్చక బృందం ఆధ్వర్యంలో తిరువీధి సేవ నిర్వహించారు. స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, అర్చకులు సంఘర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, నండూరిరాజ గోపాలాచార్యులు, పవన్, ఆలయ ఇన్ స్పెక్టర్ కూర్మేశ్వరరావు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

మట్లాడుతున్న ఎఇ

సూర్య ఘర్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-రావికమతం: ప్రధానమంత్రి సూర్య ఘర్ సోలార్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రావికమతం విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో చినపాచిల గ్రామంలో సర్పంచ్ కోమటి రామలక్ష్మి, రావికమతం టిడిపి పార్టీ అధ్యక్షులు కోమటి శంకర్రావు అధ్యక్షతన అవగాహన సదస్సును సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ, సౌర విద్యుత్తు ఉత్పత్తికి ప్రతి ఒక్కరు సోలార్ రూఫ్ టాప్ అమర్చుకోవాలని తెలిపారు. సూర్య ఘర్ పథకంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. జల విద్యుత్తు ఉత్పత్తి రోజురోజుకు తగ్గుతున్న కారణంగా ముందస్తు చర్యగా కేంద్ర ప్రభుత్వం సౌర విద్యుత్తు ఉత్పత్తికి ప్రత్యేక రాయితీలతో ఈ పథకాన్ని అందిస్తుందన్నారు. ఈ పథకానికి సంబంధించి 78 వేల వకు ప్రభుత్వ సబ్సిడీగా, మిగిలిన సొమ్ము బ్యాంకు రుణముగా ఇప్పించడం జరుగుతుందన్నారు. లబ్ధిదారుని వాటాగా 20 వేల రూపాయలు చెల్లిస్తే తమ ఇంటి పైన సూర్యగర్ సోలార్ సిస్టం పూర్తిగా అమర్చడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం సూర్య ఘర్ పోస్టర్ ను ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఎంపిటీసీ తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభ జయప్రదానికి ప్రచారాలు

ప్రజాశక్తి-మధురవాడ : సిఐటియు 18వ అఖిల భారత మహాసభ సందర్భంగా సోమవారం కొమ్మాది కూడలి వద్ద శ్రీవినాయక దుర్గాలమ్మ ఆటో స్టాండ్ డ్రైవర్లు జెండావిష్కరణ చేశారు సిఐటియు జోన్ అధ్యక్షులు డి అప్పలరాజు మాట్లాడుతూ ఈ నెల 31 నుంచి వచ్చేనెల 4 వరకు మహాసభలో భాగంగా 4న విశాఖలో కార్మికుల భారీ ప్రదర్శన, ఆర్‌కె.బీచ్‌లో బహిరంగసభను జయప్రదం చేయాలని కోరారు. మహాసభ సందర్భంగా ఈనెల 27న శ్రామిక సంస్కృతోత్సవాల్లో సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ పాల్గొంటారని, తర్వాత రోజుల్లో .సుద్దాల అశోక్ తేజ,గోరేటి వెంకన్న హాజరవుతారన్నారు. సిఐటియు మహాసభ సందర్భంగా వారంరోజులపాటు సాంస్కృతి కోత్సవాల్లో ఏడు రోజులపాటు సినీ నటులు, దర్శకులు పాల్గొంటారన్నారు. . కార్యక్రమంలో ఆర్ సతీష్, జి.కిరణ్ కుమార్ సతీష్, కె.సత్యనారాయణ, ఎ.సాయి, జి గణేష్ ,బి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొమ్మాదిలో సిఐటియు పతాకావిష్కరణలో ఆటో కార్మికులు

గాజువాకలో మాట్లాడుతున్న రాంబాబు

బిజెపి పాలనలోకార్మికులపై దాడి.

గాజువాక. : బిజెపి హయాంలోనే కార్మికులపై దాడి పెరిగిందని సిఐటియు జిల్లా నాయకులు ఎం.రాంబాబు అన్నారు. సిఐటియు అఖిలభారత మహాసభ సందర్భంగా శ్రీనగర్ సెంటర్లో సోమవారం నిర్వహించిన సభలో రాంబాబు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోనికూటమి ప్రభుత్వ ప్రజా,కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యపోరాటానికి కార్మికులంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు మహాసభ వేదికగా దీనికి భవిష్యత్ కార్యాచరణ జరుగుతుందన్నారు. మహాసభలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బంగారు నాయుడు, కె.అవతారం, ఇ.తాతారావు, ఇమ్మాన్యుయేల్ పాల్గొన్నారు.

2కె రన్ పోస్టర్ ఆవిష్కరణ

యలమంచిలి టౌన్ : సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఈ నెల 27న అచ్యుతాపురం విద్యుత్ కార్యాలయం నుండి జంగులూరు జంక్షన్ వరకు జరుగు 2ఎ రన్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం అచ్యుతాపురంలో సిఐటియు నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రొంగలి అరుణ్, కాకి వంశీ, కూండ్రపు వెంకటరావు, అనిమిరెడ్డి ప్రశాంత్, జె.అప్పలరాజు, కడారి అప్పారావు పాల్గొన్నారు.

జివిఎంసిలో పిపిపి పేరిట రోడ్ల ప్రయివేటీకరణను ఉపసంహరించాలి

మేయర్‌కు సిపిఎం ఫ్లోర్ లీడర్ గంగారావు వినతి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలో 88.3 కిలోమీటర్ల పొడవు గల ప్రధాన రోడ్లను 10 ఏళ్ల పాటు ప్రయివేటు సంస్థలకు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విశాఖ ప్రజలకు తీవ్ర హానిచేస్తుందని, దీన్ని ఉపసంహరించాలని సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు జివిఎంసి మేయర్ పీలా శ్రీనివాసరావుకు సోమవారం గంగారావు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ, గత నెల 21వ తేదీన జరిగిన జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో తాను పిపిపి విధానంలో రోడ్ల నిర్మించవద్దని తీవ్రంగా వ్యతిరేకించానని, ఈ ఎజెండాను ఉపసంహరించాలని మేయర్‌ను కోరినట్లు తెలిపారు. కనీసం చర్చ కూడా లేకుండా చంద్రబాబు ఆదేశం అని టిడిపి, జనసేన, బిజెపి కార్పొరేటర్ల సంఖ్యా బలంతో ఏకపక్షంగా ఆమోదింప జేసుకున్నారని వివరించారు.

వినతిపత్రాన్ని ఇస్తున్న గంగారావు

మొదటి దశలో మధురవాడ, ఎండాడ, ఎంవిపి, ఆర్‌కె.బీచ్, డాబాగార్డెన్, అక్కయ్యపాలెం, మురళీనగర్, పాత గాజువాక, కొత్త గాజువాక, బాలచెరువు, కూర్మన్నపాలెం ప్రాంతాల్లో 88.3 కిలోమీటర్ల పొడవు రోడ్లను ప్రయివేటు వ్యక్తులకు ఇవ్వబోతున్నారని, ఇందువల్ల రోడ్లు పదేళ్ల పాటు ప్రయివేటు కాంట్రాక్టర్ల సొంత ఆస్తులుగా ఉంటాయని తెలిపారు. రోడ్లకు తారువేయడం, రిపేర్లు చేయడం, వీధి దీపాలు, వ్యర్థాల తొలగింపు, మురుగు కాలువలు నిర్వహణ, ఫుట్ పాత్ లు, డివైడర్స్ తదితరాల నిర్వహణను ప్రయివేటు కాంట్రాక్టర్లకు అప్పజెప్పుతున్నారని వివరించారు. దీనికోసం మొత్తం రూ.306 కోట్లు కాంట్రాక్టర్లకు ఇవ్వాలని నిర్ణయించారని తెలిపారు. ఇందులో మొదటి ఏడాదిలో 40 శాతం నిధులను అనగా రూ.122 కోట్లు, తరువాత మిగిలిన సొమ్ము ఏటా ఇవ్వనున్నారని పేర్కొన్నారు. ఇది కూటమి ప్రభుత్వ పెద్ద కుంభకోణమని పేర్కొన్నారు. విశాఖ ప్రజల నుంచి ఆస్తిపన్ను, నీటి ఛార్జీలు, బిల్డింగ్ ప్లాన్ ఛార్జీలు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ సర్ ఛార్జీలు, వృత్తి పన్ను ద్వారా వచ్చే ఆదాయాన్ని లూటీ చేయడమేనన్నారు. కాంట్రాక్టర్లకు రూ.306 కోట్లు ఇవ్వడమే గాక రోడ్ల ఇరువైపులా అడ్వర్టైజ్‌మెంట్ బోర్డుల ఫీజులు, బైక్, కారు పార్కింగ్‌లు ఏర్పాటు చేసి గంటల చొప్పున ఫీజులు వసూలు చేసుకునేందుకు కాంట్రాక్టర్లకు అవకాశం కల్పిస్తున్నారని తెలిపారు. ఈ ఒప్పందం ప్రజలను నిలువ దోపిడీ చేస్తుందన్నారు.

పోర్టు చరిత్రలో మరో మైలురాయి

స్వదేశీ టగ్గుల నిర్మాణానికి హెచ్ఎస్ఎల్ శ్రీకారం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : హిందుస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ సోమవారం విశాఖపట్నం పోర్టు అథారిటీ కోసం చేపట్టిన 60 టన్నుల బొల్లార్డ్ పుల్ టగ్ నిర్మాణ కార్యక్రమంలో రెండు కీలక మైలురాళ్లను అధిగమించింది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన మొదటి 60 టన్నుల బిపి టగ్‌కు నేడు కీల్ లేయింగ్ వేడుక నిర్వహించి, అధికారికంగా నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇదే సామర్థ్యం కలిగిన రెండవ టగ్ నిర్మాణం కోసం హెచ్ఎస్ఎల్, పోర్టు అథారిటీ మధ్య ఒప్పందం కుదిరింది. 32.5 మీటర్ల పొడవు ఉండే ఈ టగ్గులు, భారీ ఓడలను సురక్షితంగా, వేగంగా పోర్టులోకి తీసుకురావడానికి, తక్కువ సమయంలో కార్యకలాపాలు పూర్తి చేయడానికి ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ సందర్భంగా విశాఖ పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు మాట్లాడుతూ, పెరుగుతున్న కార్గో రద్దీ దృష్ట్యా ఇలాంటి ఆధునిక టగ్గుల అవసరం ఎంతో ఉందన్నారు. నాణ్యమైన పనులతో హెచ్ఎస్ఎల్ తమ నమ్మకాన్ని నిలబెట్టుకుంటోందని కొనియాడారు. హెచ్ఎస్ఎల్ సిఎండి కమోడోర్ గిరిదీప్ సింగ్ మాట్లాడుతూ, 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా స్వదేశీ పరిజ్ఞానంతో ఈ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక ఎంఎస్ఎంఇ రంగాలకు ఉపాధి లభించడమే కాకుండా, భారత సముద్ర రంగ స్వయంప్రతిపత్తి మరింత బలోపేతం కానుందని చెప్పారు.

యుటిఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శ్రీలక్ష్మి, చిన్నబ్బాయ్

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీలక్ష్మి, చిన్నబ్బాయ్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో జరిగిన యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా అధ్యక్షులుగా వత్సవాయి శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా గొంది చినబ్బాయ్, గౌరవాధ్యక్షులుగా పంపన బోయిన వెంకట్రావు, సహాధ్యక్షులుగా రొంగలి అక్కు నాయుడు, రొంగలి ఉమాదేవి, కోశాధికారిగా జోగా రాజేష్, కార్యదర్శులుగా పాలిమేర చంద్రరావు, గుత్తుల సూర్య ప్రకాశరావు, వైరాల రమేష్‌రావు, ఉప్పాడ రాము, కట్టా శ్రీరామచంద్రమూర్తి, జాలాది శాంతకుమారి, మురహరి సంతోష్, గేదెల శాంతి దేవి, చైతన్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బైలపూడి దేముడు నాయుడు, సభ్యులుగా షేక్ సలీం, కాట్రపల్లి సత్తిబాబు, రూత్తల లక్ష్మణ రాజు, అనిమిరెడ్డి సాంబమూర్తి, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎస్ఎస్ నాగమణి, ఇ.ఎల్లయ్య బాబు, ఎంవి అప్పారావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సుర్ల మురళీమోహన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన నాయకులు మాట్లాడుతూ విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న యుటిఎఫ్ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు